

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com





హైదరాబాద్ గురువారం 24-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:44 పేజీలు: 8 వెల: రూ.1/-


## రైతుకుటుంబానికి బీమా చెక్కు అందించిన ఎమ్మెల్యే

### -రవిశంకర్‌ను అభినందించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): చొప్పదండి టీఆర్ఎస్ ఎమ్మెల్యే రవిశంకర్‌ను



రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అభినందించారు. చొప్పదండి నియోజకవర్గ ంలోని గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన రైతు తొందుర్తి సుధాకర్ ఇటీవలే అనారోగ్యంతో చనిపోయాడు. ఆ కుటుంబానికి రైతుబీమా పథకం కింద ప్రభుత్వం రూ. 5 లక్షల చెక్కును మంజూరు చేసింది. ఈ చెక్కును ఎమ్మెల్యే రవిశంకర్ నేరుగా ఆ రైతు ఇంటికి తీసుకెళ్లి, కుటుంబ సభ్యులకు అందజేశారు. సుధాకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. దీనిపై కేటీఆర్ ట్విట్టర్‌లో స్పందిస్తూ.. ఎమ్మెల్యే రవిశంకర్ స్వయంగా రైతు కుటుంబం వద్దకు వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపి, రూ. 5 లక్షల చెక్కును అందజేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్నదాతలకు, వారి కుటుంబాల కు అండగా ఉండేందుకు తెలంగాణ సర్కార్ ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తోంది. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులను ప్రభుత్వం ఆదుకుంటోంది. ఎకరానికి రూ. 5 వేల చొప్పున సంవత్సరానికి రెండుసార్లు రైతులకు రైతుబంధు పథకం కింద నగదును చెక్కు రూపంలో అందిస్తోంది. అదే విధంగా రైతు అనారోగ్యంతో లేదా ఇతర కారణాల చేత చనిపోతే ఆ కుటుంబాలకు రూ. 5 లక్షల చెక్కును ప్రభుత్వం ఇస్తోంది. 2018 ఆగస్టు 14న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా రైతు బీమా పథకం ప్రారంభమైంది.

## కాశ్మీర్ అధికార భాషల బిల్లును ఆమోదించిన రాజ్యసభ

న్యూఢిల్లీ, సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): లోక్‌సభలో ఆమోదం పొందిన జమ్మూకశ్మీర్ అధికార భాషల బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ .. జమ్మూకశ్మీర్‌లోని 74 శాతం మంది జనాభా కశ్మీరీ, డోగ్రీ భాషలను మాట్లాడుతారన్నారు. ఈ రెండు భాషలను అధికార భాషలుగా ప్రకటించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నట్లు చెప్పారు. 70 ఏళ్ల నుంచి వారి డిమాండ్‌ను ఎవరూ పట్టించుకోలేదన్నారు. కేవలం ఒక శాతం మంది మాట్లాడే ఉర్దూ భాషను మాత్రమే అధికారిక భాషగా గుర్తించారన్నారు. కశ్మీర్‌లో కేవలం 2 శాతం మంది మాత్రమే హిందీ భాష మాట్లాడుతారని, కానీ హిందీ జాతీయ భాష కావడం వల్ల ఆ భాషను కూడా కశ్మీర్ లిస్టులో చేర్చినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. కశ్మీర్‌లో పంజాబీ, పహాడీ, గుర్‌జారీ భాషలను కూడా ప్రమోట్ చేయనున్నట్లు మంత్రి చెప్పారు. డోగ్రీ, కశ్మీరీ భాషల పట్ల కేంద్ర మంత్రి రామ్‌దాస్ అత్వాలే కూడా మద్దతు తెలిపారు.

## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం కొత్త సంస్కరణలు!

హైదరాబాద్,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రమాణాలను పెంచేందుకు నూతన సంస్కరణలు తీసుకురావాలని కేటీఆర్ పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింతగా పెంచుతామని స్పష్టం చేశారు. నూతన సంస్కరణలతో రాష్ట్ర ప్రయోజనాలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రమాణాల పెంపుపై ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, పలు శాఖల అధిపతులు హాజరయ్యారు. పౌరులకు అన్ని సేవలు ఒకే చోట అందించేందుకు సిటీజన్ సర్వీస్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌కు కేటీఆర్ ప్రతిపాదన చేశారు. శాఖల పరంగా చేపట్టే సంస్కరణలతో ఆయా శాఖల పనితీరులో సానుకూల మార్పులు చేయాలన్నారు. టీఎస్ బీపాస్ అనేది చారిత్రాత్మక చట్టమని పేర్కొన్నారు. చట్టం అమలులో వివిధ శాఖల సహకారం, సమన్వయం అవసరమన్నారు. టీఎస్ బీపాస్



అనుమతులకు సంబంధించి అవసరం ఉన్న ప్రతి శాఖ నుంచి ఒక్కొక్క నోడల్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించారు. త్వరలోనే ఈ చట్టాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ ప్రకటిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరిన్ని సంస్కరణలు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రమాణాల పెంపుపై కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ సంస్కరణలతో రాష్ట్ర పౌరులకు సైతం అనేక ప్రయోజనాలుంటాయని తెలిపారు. సంస్కరణలతో ఆయా శాఖల పనితీరులో సానుకూల మార్పులు తెస్తామని మంత్రి పేర్కొన్నారు. పౌరులకి అన్ని సేవలను ఒకేచోట అందించేందుకు.. ప్రత్యేకంగా సిటిజన్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌కు ప్రతిపాదనలు చేస్తామని చెప్పారు. టీఎస్ బీపాస్ అమలుపైనా సమావేశంలో చర్చించామని, చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు శాఖల మధ్య సమన్వయం అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రమాణాలను మరింత పెంచాలని ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. దీనికి సంబంధించి నూతన సంస్కరణలు తీసుకు రావాలని అన్నారు. బుధవారం దీనికి సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నూతన సంస్కరణలతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.

## విదేశీ నిధుల నియంత్ర సవరణ బిల్లు

### ఆమోదించిన రాజ్యసభ..

న్యూఢిల్లీ,సెప్టెంబరు 23(ఆర్ఎన్ఎ): విదేశీ నిధుల నియంత్ర సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. జాతీయ, అంతర్జాతీయ భద్రతకు ఎఫ్‌సీఆర్ఏ బిల్లు పనిచేస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. బిల్లుపై చర్చ జరిగిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ నిధులను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు ఈ కొత్త చట్టం తీసుకు వస్తున్నట్లు తెలిపారు. భారతదేశ రాజకీయ సామాజిక స్థితిగతులపై విదేశీ నిధుల ప్రభావం పడకుండా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. విదేశీ నిధులు తీసుకునే అనేక సంస్థలు తమ ఐడెంటీని దాచిపెట్టినట్లు మంత్రి తెలిపారు. అందుకే ఆధార్ కార్డును తీసుకువచ్చినట్లు చెప్పారు. ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని 2010లో తీసుకువచ్చారని, అప్పుడు కేంద్ర హోంమంత్రిగా చిదంబరం ఉన్నారని, సుమారు 20 వేల కోట్లు విదేశీ నిధుల రూపంలో వచ్చాయని చెప్పినట్లు మంత్రి రాయ్ గుర్తు చేశారు. కానీ సుమారు 10 వేల కోట్ల నిధులు ఎక్కడికి వెళ్లాయో సమాచారం లేదన్నారు. మంచి ఉద్దేశంతో పనిచేస్తున్న ఎన్‌జీవోలకు ఈ బిల్లుతో ఎటువంటి ప్రమాదం లేదని ఎంపీ బాలసుబ్రమణియన్ తెలిపారు. ఉద్యోగాలు పోవని, కానీ ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసేందుకు ఎన్జీవోలు ఢిల్లీకి రావాల్సిన అసవరం లేదని, సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచీలో ఖాతా తీసుకోవచ్చన్నారు. లోక్‌సభలో ఎఫ్‌సీఆర్ఏ బిల్లును సెప్టెంబర్ 21వ తేదీనే పాస్ చేశారు.

## ప్రాజెక్టులకు భారీగా పెరుగుతున్న వరద

### నిండుకుండలా శ్రీశైలం,సాగర్ సింగూరు,ఎల్లంపల్లిలకు వరదరాక

హైదరాబాద్,సెప్టెంబరు 23(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్రాజెక్టులకు భారీగా వరదనీరు వచ్చిచేరుతోంది.కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు వరద స్థిరంగా కొనసాగుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో వచ్చిన ఇన్‌ఫ్లోను దిగువకు వదులుతున్నారు. బుధవారం ఉదయం 2,50,459 క్యూసెక్కుల ప్రవాహం జలాశయానికి వస్తున్నది. దీంతో అధికారులు పది గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 3,99,309 క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.50 అడుగుల మేర నీరుంది. పూర్తిస్థాయి నీటి నిల్వసామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 212.4385 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. కుడిగట్టులో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 3,42,378 క్యూసెక్కుల భారీగా వరద వస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టు నిండడంతో అధికారులు వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. జలాశయం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 312.0405 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 310.55 టీఎంసీల మేర నీరుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 589.50 అడుగులకు వరకు నీరుంది. దీంతో అధికారులు 20 గేట్లు ఎత్తి 3,42,378 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. భారీ వర్షాల కారణంగా సింగూర్ ప్రాజెక్టులో రోజు రోజుకు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతోంది. సింగూర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 19.429 టీఎంసీలుగా నమోదు అయ్యింది. ప్రాజెక్టులోకి నీటి ఇన్ ఫ్లో 8245 క్యూసెక్కులుగా కొనసాగుతోంది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాల కోసం ప్రతి రోజు 60 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటి ఆవిరి, లికేజ్ ద్వారా 60 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సింగూర్ ప్రాజెక్టులో మొత్తం నీటి ఔట్ ఎ÷-లో 120 క్యూసెక్కులుగా నమోదు అయ్యింది. అలాగే పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలుగా ఉంది. మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 25 గేట్లు ఎత్తివేసి... 2,27,735 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ ఇన్ ఎ÷-లో 2,51,406 క్యూసెక్కులుగా ఉంది. అలాగే పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలుగా.. ప్రస్తుత నీటి నిల్వ 17.8970 టీఎంసీలుగా నమోదు అయ్యింది.

## రేపటి నుంచి తెరుచుకోనున్న గౌహతి కామాఖ్యా ఆలయం

గౌహతి, సెప్టెంబర్ 23 : పలు నిబంధనల మధ్య అసోంలోని గౌహతి కామాఖ్యా ఆలయం తలుపులు రేపటి నుంచి తెరుచుకోనున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఈ ఆలయాన్ని మార్చి 17 నుంచి మూసివేశారు. అన్‌లాక్-4 నిబంధనల మేరకు పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అసోంలోని మహా శక్తిపీఠ్ కామాఖ్యా ఆలయ తలుపులు రేపటి నుంచి భక్తుల కోసం తెరుస్తున్నారు. దీనికి ఆలయ ట్రస్ట్ సన్నాహాలు ప్రారంభించింది. ఆలయ దర్శనం కోసం చాలా కఠినమైన మార్గదర్శకాలు ఏర్పాటు చేశారు. గౌహతిలో కరోనా కేసులు పెద్ద సంఖ్యలో ఉండటంతో.. ఆలయాన్ని తెరిచేందుకు ట్రస్ట్ వెనుకంజ వేసింది. అయితే ఆలయాన్ని తెరవాలన్న డిమాండ్ చాలా కాలంగా కొనసాగుతుండటంతో చివరకు కేంద్రం మార్గదర్శకాల మేరకు భక్తులకు ఆలయ ప్రవేశం కల్పించనున్నారు. ప్రదక్షిణ కోసమే భక్తులు ఆలయంలోకి రావాలని ట్రస్ట్ ముందుగా ప్రతిపాదించింది. రేపటి నుంచి రోజుకు 500 మంది భక్తులను మాత్రమే అనుమతించనున్నారు. ప్రతి భక్తుడు 15 నిమిషాల కన్నా ఎక్కువ ఆలయంలో ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం భక్తులకు ప్రవేశం కల్పించేందుకు ఆలయ ట్రస్ట్ పూర్తి సన్నాహాలు చేసింది.

లాక్‌డౌన్‌కు ముందు నిత్యం 1500 నుంచి 2000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేవారు. పండుగ సీజన్‌లో 20 నుంచి 25 లక్షల మంది కూడా వస్తారు. ముఖ్యంగా జూన్ నెలలో జరిగే అంబువాచి పండుగ సమయంలో ఆలయంలో భక్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది.

మార్గదర్శకాలు : ఆలయ వెబ్‌సైట్‌కు కనీసం ఒక రోజు ముందు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. ఒకేసారి వంద మందికి పైగా ఆలయం లోపల ప్రవేశం ఉండదు. కరోనా నెగెటివ్ ఉన్న భక్తులను మాత్రవే అనుమతిస్తారు. ఏ భక్తుడైనా 15 నిమిషాల పాటు ఆలయంలో ఉండొచ్చు. బయటి వ్యక్తులను ప్రత్యేక ఆరాధన మొదలైన వాటిలో అనుమతించరు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఆలయాన్ని శుభ్రపరుస్తారు. ఆలయాన్ని సందర్శించే భక్తులు కూడా యాంటిజెన్ పరీక్ష చేయించుకోవాలి. ఇందుకోసం ఆలయంలో వైద్య బృందాన్ని కేటాయించారు.

లాక్‌డౌన్ సమయంలో ఈ ఆలయాన్ని మూసివేయడంతో ట్రస్ట్ చాలా నష్టపోయింది. ఈ సమయంలో ఆలయానికి విరాళాల చాలా తక్కువగా అందాయి. దాంతో గత 6 నెలలుగా ఆలయ ఆర్థిక పరిస్థితి బాగా ప్రభావితమైంది. ప్రతి ఏటా జూన్‌లో జరిగే ప్రసిద్ధ అంబువాచి పండుగను కూడా నిర్వహించలేదు. ఈ కారణంగా ఆలయానికి విరాళాలు దాదాపు సున్నాగా మారాయి. ఆలయంలో 250 మంది ఉద్యోగులు ఉండగా.. శానిటరీ కార్మికులకు పూర్తి జీతం ఇస్తున్నారు.

## ముంబైని ముంచెత్తిన భారీ వర్షాలు

### -లోతట్టు ప్రాంతాలు జలమయం

ముంబై,సెప్టెంబరు 23(ఆర్ఎన్ఎ): ఆర్థిక రాజధాని ముంబైని వర్షాలు ముంచెత్తాయి. గత 24 గంటలుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వానలతో నగరంలోని చాలా ప్రాంతాలు వరదల్లో చిక్కుకున్నాయి. కరోనా రోగులకు సేవలందిస్తున్న నాయర్ దవాఖాన వరద నీటితో నిండిపోయింది. కరోనా వార్డులోని పలు వస్తువులు నీటిలో తేలియాడుతూ కన్పించాయి. వార్డు మొత్తం వాన నీటితో నిండిపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంబైలోని పలుప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. గత 24 గంటల్లో 173 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యిందని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) వెల్లడించింది. దీంతో పలు లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపైకి భారీగా నీరు చేరింది. అదేవిధంగా రైలు పట్టాలు కూడా నీట మునిగాయి. ఫలితంగా లోకల్ రైళ్లతోపాటు బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు లోకల్ రైళ్లను వెస్టర్న్ రైల్వే రద్దుచేసింది.

## రైతును కాపాడడం మా కర్తవ్యం : ఎంపీ కేకే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: రైతును కాపాడడం తమ కర్తవ్యమని రాజ్యసభలో టీఆర్ఎస్ నేత కే కేశవరావు అన్నారు. కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో విపక్షాల నిరసన చేపట్టాయి. గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మార్చ్ నిర్వహించిన నిర్వహించాయి. విపక్ష సభ్యులతో కలిసి టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు ఆందోళనలో పాల్గొన్నారు. రైతాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజ్యసభలో టీఆర్ఎస్ నేత కే కేశవరావు మాట్లాడుతూ మొదటిసారిగా ప్రతిపక్షాలు అన్ని ర్యాలీ తీసినట్లు చెప్పారు.

గాంధీ స్ఫూర్తితో ర్యాలీ తీశామని, మహాత్ముడు సైతం భూమి కర్షకుడిదే అన్నాడని గుర్తు చేశారు. అలాంటి భూమిని కార్పోరేట్ సెక్టార్‌కి అప్పగించి రైతును అణగదొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతును కాపాడడం మా కర్తవ్యమని స్పష్టం చేశారు. వ్యవసాయ బిల్లును కేంద్ర ప్రభుత్వం సభలో తప్పుడు పద్ధతిలో పాస్ చేశారని ఆరోపించారు. సభ్యులను రూల్స్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారన్నారు. బిల్లును వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు జీ సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, సురేష్‌రెడ్డితో పాటు విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు పాల్గొన్నారు.

## నాలా మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

హైదరాబాద్,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): ఇటీవలి వర్షాలకు హైదరాబాద్‌లో వేర్వేరు ఘటనల్లో నాలాలో పడి మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర పశు సంవర్ధక మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్షమాపణ చెప్పారు. ఇలాంటి ఘటనలు జరగడం తప్పేనని, బాధిత కుటుంబాలను తప్పనిసరిగా ఆదుకుంటామని తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్నందునే కాంగ్రెస్ పార్టీ నాటకాలకు తెరలేపిందని విమర్శించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 150 డివిజన్లలో పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకడం కూడా కష్టమేనన్నారు. మంత్రి కేటీఆర్ పనితీరుపై కాంగ్రెస్ నేతల సర్టిఫికెట్లు అవసరం లేదని, ప్రచార యావతోనే విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షలా మారిన ఈ రోజుల్లో అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి వర్గాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు.

## నక్సలైట్ల మరో దుశ్చర్య

### ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి దారుణహత్య

రాయ్‌పూర్,సెప్టెంబరు 23(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో దారుణం జరిగింది. మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. సుక్మా జిల్లాలోని కుండేడ్ గ్రామానికి చెందిన ఓ 22 ఏళ్ల యువకుడిని ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఏరియాలో మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మృతుడి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. బీజాపూర్ జిల్లా గంగలూర్ పరిధిలోని కుర్చేలి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను మావోయిస్టులు మంగళవారం సాయంత్రం హతమార్చిన విషయం తెలిసిందే. మరికొంతమంది గ్రామస్తులను మావోలు కిడ్నాప్ చేశారు. బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 5వ తేదీన బీజాపూర్ జిల్లాలోని మోటపాల్ - పూనూర్ సమీపంలో నలుగురు వ్యక్తులను మావోయిస్టులు హత్య చేశారు. మోటపాల్ గ్రామానికి చెందిన 25 మందిని మావోయిస్టులు అపహరించారు. అనంతరం ప్రజాకోర్టు నిర్వహించి నలుగురు వ్యక్తుల గొంతు కోసి చంపారు మావోయిస్టులు. ఆ తర్వాత ఐదుగురిని విడుదల చేసిన మావోయిస్టులు.. మిగతా 16 మందిని తమ ఆధీనంలోనే ఉంచుకున్నారు.

## మల్కాజిగిరి ఎసిపి ఆదాయం 50కోట్లు

### ఎసిబి దాడులతో బట్టబయలు అయిన అవినీతి

### పలుచోట్ల అక్రమాస్తులను గుర్తించే పనిలో అధికారులు

హైదరాబాద్,సెప్టెంబరు 23(ఆర్ఎన్ఎ): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మల్కాజ్‌గిరి ఏసీపీ నరసింహారెడ్డి ఇంటిపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. గతంలో ఉప్పల్ సీఐగా నరసింహారెడ్డి పని చేశారు. పలు ల్యాండ్ సెటిల్మెంట్లు, భూ వివాదాల్లో ఏసీపీ తల దూర్చినట్లు తెలుస్తోంది. నరసింహా రెడ్డితో పాటు అతని కుటుంబీకుల ఇళ్లల్లో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాదులో ఆరు చోట్ల ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీపీ నివాసంతో పాటు ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో 12 చోట్ల అధికారులు సోదాలు చేస్తున్నారు. అయితే ఆయన అనేక భూతగాదాల్లో తలదూర్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏసీపీ నర్సింహారెడ్డి రూ. 50 కోట్ల అక్రమాస్తులు సంపాదించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. మాజీ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి అల్లుడు నర్సింహారెడ్డి. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, మహేంద్రహిల్స్, డీడీ కాలనీ, అంబర్‌పేట, ఉప్పల్, వరంగల్‌లో 3 చోట్ల, కరీంనగర్‌లో 2 చోట్, నల్లగొండలో 2 చోట్ల, అనంతపూర్‌లో సోదాలు కొనసాగాయి. సికింద్రాబాద్ నివాసంలో భారీగా బంగారు, వెండి ఆభరణాలను అధికారులు గుర్తించారు. 2008 నుంచి 2010 వరకు మియాపూర్‌లో సీఐగా పని చేసిన నరసింహారెడ్డి పలు భూవివాదాల్లో తలదూర్చి ఆస్తులు కూడబెట్టినట్లు తేల్చారు. ఉప్పల్, మల్కాజ్‌గిరిల్లోనూ భూవివాదాల్లో ఏసీపీ తలదూర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌లో 20చోట్ల ఏసీబీ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇక ఒకే సమయంలో ఏసీబీ అధికారులు 34 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. వరంగల్ జిల్లాలో మూడు చోట్ల, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లో రెండు చోట్ల, ఏపీలోని అనంతపురంలో ఒక చోట అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. మాజీ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అల్లుడు అయిన ఏసీపీ నరసింహారెడ్డి రూ.50 కోట్ల అక్రమాస్తులు సంపాదించినట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించారు.

## నవంబర్‌లో మరో 11మంది సభ్యుల పదవీవిరమణ

### రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటన

న్యూఢిల్లీ,సెప్టెంబరు 23(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది నవంబరులో మరో 11 మంది రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ ఎం వెంకయ్య నాయుడు బుధవారం సభలో ప్రకటించారు. వీరంతా నిరంతరం ప్రజాసేవలో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఛత్రపాల్ సింగ్ యాదవ్, జావేద్ అలీఖాన్, పిఎల్ పునియా, రవిప్రకాష్ వర్మ, రాజారామ్, రామ్ గోపాల్ యాదవ్, వీర్ సింగ్, హర్దీప్ సింగ్ పూరి, నీరజ్ శేఖర్, అరుణ్ సింగ్, రాజ్ బబ్బర్ లు నవంబరులో పదవీ విరమణ చేయనున్నారని వెంకయ్యనాయుడు రాజ్యసభలో వెల్లడించారు.రాజ్యసభ సభ్యులుగా పదవీ విరమణ చేసినా దేశ ప్రజలకు సేవ చేయాలని వెంకయ్య కోరారు.పదవీ విరమణ చేయనున్న సభ్యులు ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాలని, వారు ప్రజలకు సేవ చేస్తూనే ఉండాలని సూచించారు. రాజ్యసభలో ప్రతి సభ్యుడు ఆరు సంవత్సరాల కాలానికి ఎన్నికవుతారు.సభ్యుల్లో మూడింట ఒకవంతు ప్రతీ రెండవ సంవత్సరం పదవీ విరమణ చేస్తారు.

## చైనా నుండి తగ్గిన దిగుమతులు : పీయూష్ గోయల్

ఢిల్లీ,సెప్టెంబర్ 23: చైనా నుండి దేశానికి దిగుమతులు తగ్గినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రాజ్యసభకు బుధవారం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. గడిచిన ఏప్రిల్ నుంచి జులై వరకు 16.60 బిలియన్ డాలర్ల బిజినెస్ జరగగా అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 23.45 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయన్నారు. అనేక ప్రపంచ, దేశీయ సరఫరా వైపు పరిమితులు ఉన్నాయని అదేవిధంగా కోవిడ్-19 సంక్షోభంతో ప్రపంచ డిమాండ్ కూడా తగ్గిందన్నారు. ఎలక్ట్రానిక్ భాగాలు, టెలికాం పరికరాలు, కంప్యూటర్ హార్డ్‌వేర్, పాడి, పారిశ్రామిక యంత్రాలు, రసాయన దాని అనుబంధ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎరువులు, ఇనుము, ఉక్కు ఉత్పత్తులు మొదలైన పారిశ్రామిక యంత్రాల దిగుమతుల్లో క్షీణతను ఉన్నట్లు పేర్కొన్నారు. దిగుమతుల క్షీణత ప్రభావాన్ని తగ్గించేందుకు దేశీయ ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటీవ్స్ ద్వారా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు వివరించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ భాగాలు, వైద్య పరికరాలు, బల్క్ డ్రగ్స్‌తో సహా ఎంపిక చేసిన రంగాలలో ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తు న్నట్లు వెల్లడించారు. అదేవిధంగా భద్రత, భారత సైబర్‌స్పేస్ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు జూన్, సెప్టెంబర్ మాసా ల్లో ప్రభుత్వం పలు యాప్‌లను నిషేధించినట్లు మంత్రి పేర్కొన్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ మున్ముందుగ నే గాలిచెడ
తన్మయి మొదలె చెడిగలా తగనటియుండన
సన్మన్మవి, సద్భక్తుని
చిన్నయుడుగు "ధూళిపాళ సీతారామునన్!!

( సెప్టెంబర్ 24 ధూళిపాళ సీతారామశాస్త్రి జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210




ఉదయసాహితి

శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి
ప్రముఖ కవి ఆచార్య కడారు వీరారెడ్డి గారి
"నవ్వండి..నవ్వించండి"
(హాస్య తరంగాలు)
గ్రంథావిష్కరణ సభ
తేది: 04-10-2020 ఆదివారం
ఉదయం 10-30 గంటలకు





ముఖ్య అతిథి ,ఆవిష్కర్త: డా. కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్ (రి) రాష్ట్రప్రభుత్వ సలహాదారులు
విశిష్ట అతిథులు: ఆచార్య అనుమాండ్ల భూమయ్య పూర్వ కులపతి , పొ.శ్రీ.తె.వి.వి.
ఆచార్య మసన చెన్నప్ప తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు , ఉ.వి
సభాధ్యక్షులు: శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య రాష్ట్ర అధ్యక్షులు , ఉదయసాహితి
గ్రంథ పరిచయం: శ్రీ శంకరనారాయణ హాస్య బ్రహ్మ
గౌరవ అతిథి: శ్రీ బైస దేవదాస్ సంపాదకులు, నేటినిజం
ఆత్మీయ అతిథి: డా. వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షులు , ఉదయసాహితి, కరీంనగర్
సభా సమన్వయం: శ్రీ దాస్యం సేనాధిపతి ప్రముఖ కవి , విమర్శకులు
అందరూ ఆహ్వానితులే
Join with Google Meet: https://meet.google.com/gge-njur-jkt
Date : 4th Oct 2020 Time : 10:30 AM - 1:00 PM

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 24-9-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

**నమ్మలేని నిజాలు**

బడిబతుకు
ఆటపాటాలు బందు
ఆన్లైన్ పాఠాలు

వానలజోరు
చెమర్చని కన్నులు
కూలిన ఇండ్లు

అక్కర రాని
చుక్కలంటె చట్టాలు
అందని ద్రాక్ష

వ్యాక్సిన్ వార్తలు
ఊరిన ఊరగాయ
రాకమానదు

ఇల్లు కావాలి
కాంక్ష కుందేటికొమ్ము
దక్కెదెపుడు?



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

గత చరిత్రకు పట్టినట్టి
దులపండోయ్ బూజు!
రాష్ట్ర మంతచాటండోయ్
రైతే ఇక రాజు !

పేరు మార్చి తీరండోయ్
అప్ డేట్ రెవెన్యూ కాక!
నూతన చట్టం పేరే
రైతు సంక్షేమం శాఖ!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

పుస్తక సమీక్ష

# రెక్క విప్పుకున్న కవిత్వం

"పరాయి చెప్పులో నాపాదం కూరుకు పోయింది." ప్రపంచవ్యాప్తమైన పరాయీకరణను ఒక్క వాక్యంలో విశాల విస్తృతార్థంలో ఆవిష్కరించిన కవి పక్కి రవీంద్రనాథ్. సంగీత సాహిత్యాలకు కాణాచి ఐన విజయనగర ఉగ్గును సేవించిన కవి. ఉత్తరాంధ్ర నుండి వసంతాన్ని మోసుకొచ్చిన మరో సాహితీ కోయిల. గురజాడ, శ్రీశ్రీల మరో వారసుడిగా కవన లోకంలోకి అడుగిడినాడు. చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని నిర్మించుకున్న పార్వతీపురం పోరాటాలను ఆలోకన చేసుకున్న కవి. తరచూ శ్రీశ్రీ "మహాప్రస్థానం", తిలక్ "అమృతం కురిసిన రాత్రి", ఇతర ప్రఖ్యాత కవుల కవిత్వం చదువుతూ, చదువుతూ కవిత్వం వ్రాయడం అలవరచుకున్న కవి. శ్రీశ్రీ, తిలక్ రెండు విభిన్న సాహితీ పాయలనూ తనలోపలికి స్వీకరించిన కవి.

రవీంద్రనాథ్ కాస్త ఆలస్యంగానే తొలి కవితా సంపుటి "పక్షితనాన్ని కలగంటూ..." మకుటంతో తీసుకొచ్చారు. ఉత్తమ కవిత్వాన్ని అందించారు. ఈ సంపుటికి శివారెడ్డి, గంటేడ గౌరునాయుడు అందించిన అభిప్రాయాలు మరింత శోభినిచ్చాయి. 2019వ సంవత్సరపు "ఎక్స్‌రే" అత్యుత్తమ కవితా అవార్డుకు ఎంపికైన పక్కి రవీంద్రనాథ్ పేరు ఒక్కమారుగా జిల్లాలు దాటి రెండు తెలుగు రాష్ట్రాలలో పరివ్యాప్తమైంది. ఈ అవార్డు ప్రదాన వేదికపై నేనూ ఉన్నాను. ఉత్తమ కవితల క్రమములో నేను రెండవ వానిగా పురస్కారం ఆయనతోపాటు స్వీకరించాను. ఆనాటి కవితల పోటీ న్యాయ నిర్ణేత, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందినీ సిధారెడ్డి, పక్కి రవీంద్రనాథ్ కవితను విశ్లేషిస్తూ ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. వస్తువు, కవిత్వీకరించిన తీరును నందిని పదేపదే ప్రశంసించారు. ఎక్స్‌రే పురస్కారాల వేదికతోనే రవీంద్రనాథ్ పరిచయమై ఈ సంపుటి నా చేతికి చేరింది. చదివిన అనంతరం సంపుటిపై స్పందించే దిశగా పక్కి కవిత్వం నన్ను ఈ విధంగా ప్రేరేపించింది. రవీంద్రనాథ్‌ను వరించిన ఎక్స్‌రే అత్యుత్తమ అవార్డు కవిత, పరాయీకరణ భూమికగా రూపొందింది.

"పరాయి చెప్పులో నా పాదం కూరుకు పోయిందనే" ఎత్తుగడతో ప్రారంభించిన కవితకు "నానేల మీద జరుగుతున్న కుట్రలను కూకటి వేళ్ళతో పెకలించాలని ఉంది" అంటూ ముగింపు పలుకుతారు. నిజమే ! పరాయీకరణ ఎంత వరకూ వెళ్ళిందంటే, ముఖ్యంగా మనదేశంలో మన కట్టు, బొట్టు, జట్టు దగ్గర నుండి భాష, యాస, గోస, ఆచార వ్యవహారాలూ, ఆహార విధానాలను కూడా అది కబళించింది. మనదైన సంస్కృతి సాంప్రదాయాలను, ఆచారాలను ధ్వంసం చేసింది. ఇంకా లోతుగా చెప్పాలంటే పరాయీకరణతో మనల్ని మనం కోల్పోయామని చెప్పవచ్చు. వ్యక్తిగత సంబంధాలు, మానవీయ అనుబంధాలు, కుటుంబ బంధాలు మృగ్యమైపోయాయి. ఒకే కుటుంబంలో ఉండే ఇద్దరు, ముగ్గురు కూడా అపరిచితులుగా బ్రతుకుతు న్నారు. ఆధునికత మాటున వైక్రో కుటుంబాలలో సైతం ఎవరికి వారైన తీరే గోచరిస్తుంది. ఇక వృద్ధుల విషయానికొస్తే అత్యంత విషాదంగా ఉంది. ఆశ్రమాల సంఖ్య నానాటికి కొండవీటి చాంతాడులా పెరిగిపోతుంది. ప్రతీవ్యక్తి మరో వ్యక్తి ఎడల ప్రవర్తించే తీరు అగమ్యంగా ఉంది. ఇదే పరిస్థితి ప్రపంచమంతటా వ్యాపించి ఉంటుందని నా బలమైన వ్యక్తిగత భావన. క్రితంలో చైనా, రష్యా దేశాలు ఆంగ్ల మాధ్యమానికి ఆవల ఉండేవి. అలాంటి దేశాలు కూడా భాష విషయంలో ఇప్పుడు తుఫాను వేగంతో వరాయీకరణ చెందుతున్నాయి. ఇక భారతదేశం





సంగతి సరే సరి!. ఉపాధి అవకాశాలు వెతుక్కునే క్రమములో ఇప్పటి వరకు ఆంగ్ల మాధ్యమము వైపు పరుగులు తీసిన యువత జపనీస్, డచ్చి, లాటిన్, చైనా దేశాల భాషలను ఆపోసన పడుతుంది. ప్రపంచం కుగ్రామం కావడం హర్షణీయమే. అయితే అదే కోవలో మానవీయ విలువలూ, జాతుల అస్తిత్వాలూ, జాతీయతా మూలాలూ విధ్వంసం కావడం పట్ల పక్కి రవీంద్రనాథ్ తీవ్రంగా కలత చెందుతారు ఈ కవితలో. ఆయన కవితారీతులు, చిక్కదనం, అల్లికల గురించీ అర్థం చేసుకోవడానికి " మళ్ళీ మొలకెత్తాలని" శీర్షికతో ఉన్న ఒక్క కవిత చదివితే సరిపోతుంది. పక్కి ఉత్తమ కవి అంటాం. ఇదే వరుసలో సంపుటిలోని కవితల్లో విరిసిన మరో నాలుగు, ఐదు వాక్యాలను విశ్లేషణగా మీకు పరిచయం చేసి సంపుటి మొత్తముగా చదివే అవకాశాన్ని మీ ఇష్టా ఇష్టాలకు అప్పగిస్తాను. వృక్షనాశనాన్ని గురించి కవి అనుభవించిన మథనాన్ని " మహాశూన్యం" తలకట్టు గల కవితలో ఆవిష్కరించారు. ముఖ్యంగా నగరాలూ, పట్టణాలూ ప్రారంభించిన యీ తరుమేధం క్రమేణా పల్లెల్లోకి కూడా చొరబడి వాతావరణ వినాశనాన్ని సృష్టించింది. ఆకాశ హర్మ్యాల నిర్మాణం కోసం, కాంక్రీట్ రహదారుల కోసం, దారుల విస్తృతి నిమిత్తము చెట్లను నరికి పడేస్తున్నారు. ఈ హననం గురించే ఒక కవి **" ప్రపంచమంతా స్మశానం కాకమునుపే చెట్టుకు దండం పెట్టండని"** హెచ్చరిస్తాడు. అదే తరహాలో రవీంద్రకూడా **"నిన్ను కోల్పోయాక/ ఒక మహాశూన్యం మా ముందు/ నోరుతెరుచుకుంటుంది"** అంటూ కనుచూపు మేరలో కనిపిస్తున్న విలయం గురించి ప్రమాద ఘంటికలు వినిపిస్తారు.

"సార్థకత" కవితను మినీ కవితగా చెప్పాలి. "అల్పాక్షరాలు-అనంతార్థం" అంటూ శ్రీశ్రీ విశ్లేషించిన మినీ కవితా లక్షణాలు పుష్కలంగా అనుసరించారు కవి. 20 పదాలతో పుస్తకం ప్రయోజనం గురించి అద్భుతమైన కవిత అల్లారు. పుస్తకం - మస్తకానికి, గుండెకూ, మొత్తంగా మనిషికి అందించే వికాసాన్ని విస్తృతార్థంలో చెప్పుకొచ్చారు. " మనిషే పుస్తకం కావాలి" అంటారు. అప్పుడే మనిషి జీవితానికి సార్థకత చేకూరుతుందంటారు. కదా! మరి. మనిషి మార్గదర్శి కావాలి. తన నడకతో, నడతతో సమాజానికి దిక్సూచిగా నిలవాలి. అనేకమంది ప్రవక్తలు, సంఘసంస్కర్తలూ పరిచిన మార్గం ఇదే కదా!. ఆ త్రోవలోనే మనిషి పుస్తకం వలే జీవించాలని కోరుకుంటారు కవి. ఈ కవిత "నవ్య" వారపత్రికలో ముద్రితమైంది. గొప్ప భావుకత మిళితమైన ఈ కవితను ఎస్.డి. కుమార్ అనే కన్నడ కవి వారి నుడిలోకి అనువదించారు. కవిత విశిష్టత ఏపాటిదో అవగతమైందను కుంటాను.

"వేకువ సంతకం" కవితలో ఎప్పుడూ సానుకూల దృక్పథంతో సాగాలని సమాజానికి సందేశమిస్తారు. సంకల్పం ఉన్నతంగా ఉండాలంటారు. దు:ఖం, ఆనందం, ఆశ-నిరాశ, బలమూ-అబలమూ అన్నీ మన లోపలే ఉన్నాయంటారు. విచక్షణతో సాగమంటారు. **"నిరాశలోనైనా/ మనోనిబ్బరం మొగ్గతొడిగితే/ బ్రతుకు / కోటిరేకుల సుమమై విరిసి/ కొత్త ఆశ గుబాళిస్తుంది"** అంటూ కవితను ముగిస్తూ ప్రతీ వ్యక్తీ ఆశాదృక్పథంతో నడవాలని ఆశిస్తారు. ఒక విధంగా మనిషిని నిటారుగా నిలిపే కవిత. వెన్నుతట్టి ముందుకు నడిపించే భావం పోగుపడింది. గృహాన్ని వీడి వెళ్లిన గృహిణి అనంతర పరిణామాలను "మరో నిర్వచనం" కవితలో విషాదంగా కవిత్వీకరించారు. ఆమె వెళ్ళిపోయిన పిదప "గడియారం ఆగిపోయింది" ఈ రెండు పదాలతో కాలమే నిలిచిపోయిందనే విశాలార్థంతో భవిష్యత్ అంధకారాన్ని చిత్రించారు. "ఎన్ని తరాల కాటుక ఖేదవర్ణమై/ ఈ గోడల నిండా పేరుకుందో ! " అంటూ గృహం కళ, కాంతి కోల్పోయి చీకటిమయమైందన్న విస్తృతార్థాన్ని విశదపరిచారు. **"ఆమెలేని తనంతో/నాగుండె చిల్లుకుండగా మారింది"** అంటూ దైన్యం నిండిన జీవితాన్ని బలంగా వినిపించారు రవీంద్ర.

సంపుటి మకుటం "పక్షితనాన్ని కలగంటూ ... " అనే అంశాన్ని గురించి విశ్లేషించుకుంటే అవును, ప్రకృతిలోని ప్రతి జీవీ స్వేచ్ఛనే కోరుకుంటుంది. బంధనాలను వ్యతిరేకిస్తుంది. నింగిలో ఏ అవరోధము లేకుండా రెక్కవిప్పిన పక్షిలా ఎగరాలని కలలుగంటుంది. అలాంటి పక్షి తనాన్ని మన రవీంద్రనాథ్ కూడా కలగంటున్నాడు. ఆయన కనే కలలు పృథివిలోని ప్రతి జీవి అనుభవంలోకి రావాలని మనమూ ఆశిద్దాం.

**"సంక్రాంతి ముగ్గులాంటి/ మాపల్లె జీవనమిప్పుడు / అర్థంకాని నిశాని ముద్రయిపోయింది." " మా పంట భూముల్లోనే / మమ్మల్ని కలుపుమొక్కల్ని చేసి/ ఏరిపారేస్తున్నారు," కళ్ళనిండా నాగావళమ్మ పరవళ్ళతో/నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాను."** వంటి అద్భుత భావుకతలున్న సన్నివేశాలు రవీంద్ర కవితల్లో నిండివున్నాయి. భావచిత్రాలతో తొణికిసలాడుతుంటాయి. పాఠకులు నింపారా అనుభవించే కవిత్వం అందించిన రవీంద్రకు హృదయపూర్వక సాహిత్యాభినందనలు.

కవితాప్రేమికులు తప్పనిసరిగా చదవవలసిన కవితా సంపుటి "పక్షితనాన్ని కలగంటూ.." 40 కవితలు, రూ. 120/-లు వెల గలిగిన **సంపుటి కోసం** ప్రజాశక్తి, విశాలాంధ్ర పుస్తక కేంద్రాలను సందర్శించవచ్చు. మరో ప్రయత్నంగా పి.శ్రీదేవి, ఇంటి నెం.4-53, గులిపల్లి వీధి, పార్వతీపురం, విజయనగరం జిల్లా, పిన్: 535502 చిరునామను కూడా సంప్రదించవచ్చు. చదివి కవితో కూడి 9440364486 చరవాణి నంబరుతో పక్షితనాన్ని మీరు కూడా కలగనండి.



**-వై. హెచ్.కె.మోహనరావు,**
సెల్ నెం.9440154114

## అవసరమా వృద్ధాశ్రమాలు?

వార్ధక్యం ఎవరికైనా
తప్పేది కాదు.. తప్పు కాదు.
వృద్ధాప్యంలో తల్లిదండ్రులు
పిల్లల ఆదరణ, ఆలన కోరుకోవడం
అత్యాశా కాదు.
కన్న బిడ్డల చెంత గడపాలనే ఆరాటం
అవసాన దశలో సహజం.

ఏ ఇంటి కోడలైనా
ఓ ఇంటి కూతురే.
మెట్టినింట్లో..
కూతురు లేని వాళ్ళకు కూతురు
ఉన్నవాళ్లకు మరో కూతురు.
కొత్త బంధాలతో..
కాలానుగుణంగా సహజం
అధికారాల్లో మార్పులు.
ఇంటి పెత్తనానికి
'గౌరవం' తో స్థానభ్రంశం.
కాదనలేని సత్యం!

కోడలైన 'కూతురు' కు
పోషించే అధికారం ఓ బాధ్యతయితే
ప్రపంచంలో ఎక్కడైనా
వృద్ధాశ్రమాల ఊసే ఉండదు.
విడ్డూరం కాదా
జన్మనిచ్చిన వారిని అనాథలలా
వృద్ధాశ్రమాల్లో వదిలేయడం?
'కనిపించని' దేవుళ్ళకన్నా
'కనిపెంచిన' దేవుళ్ళు కాదా మిన్న?

అవును..
అవసరమే కొంత మేరకు
అనాథాశ్రమాలు
ఏ దిక్కూ లేని వారికి.
అవసరమా
ఇంకా బ్రతికే వున్న
కన్న పిల్లల తల్లిదండ్రులకు?



**-ఆచార్య కదారు వీరారెడ్డి**
9392447007

## గురుదక్షిణ !

అనంత శక్తి ప్రదాయిని
అదృశ్య హృదయనేత్రి
అమృతానందమయ మనోమైత్రి
అపరిమితమైన వాత్సల్యంతో
జగన్మాత తన శిశువులకు
శిలలో దాచిన శిల్పంలా
సూర్యునిలో దాచిన శక్తిలా
ధరణిలో దాచిన ధాతువులా
శాంతిలో దాచిన ప్రశాంతతలా
పాలలో దాచిన నెయ్యిలా
విత్తనంలో దాచిన పంటలా
విశ్వంలో దాచిన పంచభూతాల్లా
సముద్రంలో దాచిన అమృతంలా
పట్టుదలలో దాచిన ఫలితంలా
నమ్మకంలో దాచిన విశ్వాసంలా
మకరందంలో దాచిన మాధుర్యంలా..
అడగకుండానే అన్నీ ఇస్తుంది !.
ఓ జగత్సాక్షీ ... !
అక్షయమైన ప్రేమను
అనురాగంతో నిండిన ప్రీతిని
ఆత్మీయతతో కూడిన ఇష్టాన్ని
అనుస్మరణీయమైన లాలిత్యాన్ని
ఆంతర్యంలో దాచుకున్న బాంధవ్యాన్ని
అభిమానంతో మమేకమైన గారాబాన్ని
మనసుతో దరిచేర్చుకొనే అనుబంధాన్ని
నిత్యానందమైన చిరునవ్వు వదనంతో
లోకానికి నిరాయుధ రక్షణ కవచమై
నిస్వార్థ సత్యాన్వేష నిబద్ధతతో
సూర్యచంద్రులచే సృష్టిని నడిపిస్తూ
ప్రాణవాయువును నలుదిశల్లో నింపి
ప్రాణాలు నిలుపుతున్నావు !

ఓ లోకమాతా !
నిమిత్తమాత్రులమైన మేము
నీకేఅమూల్యమైన గురుదక్షిణిచ్చి
ఋణం తీర్చుకోగలం ?
నీపాదస్పర్శనే పరమ దివ్యౌషధమనుకొని
నీచూపే మా శిరస్సుపై ఆశీర్వాదమనుకొని
నిర్మలమనసుతో మౌనంగా మోకరిల్లుతూ
నిత్యం ముకుళిత హస్తాలతో ప్రణామంచేస్తూ
ఆరాధించటం తప్ప !!



- రాజేశ్
9440460490

## జననం-మరణం

తల్లి గర్భంనుండి
వచ్చేది -
పుడమితల్లి గర్భంలో
కలగలిసి పోయేది !

- చలపాక ప్రకాష్
సెల్9247475975

## రథాలే కాదు..
## గుడిసెలు తగలబడుతున్నాయి..!

మాటలు మార్మికంగానే వుంటున్నాయి
మాటల్లో మంత్రాలు వల్లిస్తున్నారు
మాటల్లో సత్యం లోపిస్తూ వస్తుంది
చెక్కముక్కలు తగలబెడితే ఆందోళనలు
మనుషులు తగలబడితే కన్నీటిబొట్టు రాలటం లేదు
మనుషుల మెదడులు ఎండిపోతున్నాయి
అక్కడ భావాలు మొలవడం లేదు
ఒక మరణం ఖరీదైంది
ఇంకొక మరణానికి విలువే లేదు
మనిషి ఏదో ఒక మత్తును వెతుక్కుంటున్నాడు
చైతన్యంగా ఉండటమే వారికి రావడం లేదు
శాస్త్రం అంతా కథనాత్మకమవుతూ వుంది
కథలన్నీ చరిత్రగా పరిచయం అవుతున్నాయి
జీవితంలో అస్పష్టత ఎక్కువవుతుంది
జీవితానికి అర్థం కోల్పోతున్న వారిసంఖ్య పెరుగుతుంది1
జీవితాన్ని అతిగా అనుభవించటం తప్పు కాదా!
జీవితం క్రమబద్ధమైంది
విశ్వం కూడా క్రమంలోనే నడుస్తుంది
పాల సముద్రాలు సృష్టించారు
మజ్జిగ చుక్కబడితే అది పెరుగు సముద్రం కాదా..
అనే వివేచన ఏది?
ఆదిశేషుణ్ణి పాన్పు చేశారు
విష్ణువు, లక్ష్మి ఇద్దరూ దానిమీద ఎలా నిద్రిస్తారు?
ఇప్పుడు మీరు పామును
పక్కలో పెట్టుకు పణుకోగలరా?
అభూతానికి ఒక అర్థం ఉండాలి కదా!
జీవించడానికి అర్థం పోయింది
కల్పనలో వున్న అలంకారం మారిపోయింది
వయస్సుకు, స్నేహానికి అంతరం పోయింది
పరవర్షన్స్ పెరిగాయి
అతి కాంక్షాపరులు అంతర్ఘర్షణలో వున్నారు
హింసాత్మక దృశ్యాలు చూసి చూసి
హింసాత్ముకులుగా మారిపోతున్నారు
పరహింస పోయి స్వీయహింసకు గురవుతున్నారు
మరణానికి దు:ఖించడం మానివేశారు
కన్నీరు ఇంకిపోయాక జీవితంలో ఆర్ద్రతకు తావేది?
సోమరులు చేసే భజనలకు విగ్రహాలు విస్తుపోతున్నాయి
విగ్రహాలకు పట్టు చీరలు,
విగ్రహాలకు నగలు, విగ్రహాలకు పెండ్లిండ్లు
వినోదానికి దేవాలయాలే స్థావరాలు



**-డా॥ కత్తి పద్మారావు**
సెల్:9849741695

పార్కులు, లైబ్రరీలు, ల్యాబ్‌లు కరువయ్యాయి
విజ్ఞానం అందుకోవడానికి స్థావరం లేదు
పబ్బులు కొన్నిరోజులు ఆపితే ఇళ్ళే పబ్బులు చేశారు
తాగి చిందులు వేస్తున్నారు
పిల్లలకు, తల్లిదండ్రులకు అంతరాలు
ఎవరి శ్రుతి వారిది, ఎవరి నృత్యం వారిది
వంటశాల విస్తుపోతుంది
ఏ పదార్థంలో ఏమి కలిపి తింటున్నారో తెలియదు
ఉబకాయులు అవుతున్నారు
కరోనా భయం పోయింది, కరోనా విజృంభిస్తుంది
పోయినోళ్ళు పోతారు, ఉన్నోళ్ళు ఉంటారనేదే సిద్ధాంతం
అదనపు ధనం అంతా వ్యసనాలకు ఆయువు పోస్తుంది
కులం పోయినట్టు అనిపిస్తుంది
అంతరాల్లో అది ఘనీభవిస్తుంది
రాజ్యం కూడా కులం చుట్టూ తిరుగుతుంది
మనిషి మెదడు కులం కోరల్లో ఇరుక్కుంది
మనుషులు వ్యసనపరులు అయ్యాక ఉత్పత్తి శూన్యమేగా!
'ఆహారం, వస్త్రం, గృహం మేము ఇస్తాం
మాకు మీరు భజన చేయండి' అంటున్నారు
బుద్ధి తాకట్టులోకి వెళ్ళాక
ఆలోచనలు ఎక్కడనుండి పుడతాయి
అక్షరాన్ని యాంత్రికం చేస్తున్నారు
దృశ్యమాన ప్రపంచమే ఆబాస
రథాలే కాదు, గుడిసెలు తగులబడుతున్నాయి
బుద్ధికేంద్రాలు తగులబడుతున్నాయి
విజ్ఞానార్జనను సాగించండి!
బుద్ధి కుశలతను పొందండి!
సాత్వికతను అలవర్చుకోండి!
దేశంలో జీవనగమనం పెరుగుతుంది!
జీవించే హక్కే ప్రధాన సూత్రం..!

## ఆశ పొదిగిన రెక్కలు

ఓ పాలి...
ఎండిన గొంతు డీలాతనం
చెరువు వైద్యునికి చూపించు.
తన చేతులతో
దోసిళ్ళు...దోసిళ్ళుగా
నీళ్ళ ఔషధాన్ని గొంతులో పోసుద్ది.

ఓ పాలి
మండే డొక్కతో..
పంట ముంగిట కూలబడు
ముద్దలు... ముద్దలుగా
మంట నార్పుతుంది.

ఓ పాలి..
ఒంటరి మౌనాన్ని
ఎత్తుకెళ్లి
పల్లె రచ్చబండ మీద వాల్చు
మాటలు .....మాటలుగా
ఓదార్పుగీతం పాడుద్ది...

ఐదేళ్ల కోపాలి
ఏం ఒరుగుద్దని
ఆశరెక్కలు పొదిగిస్తావ్.....!
ఏం జరుగుద్ది...?
చూపుడు వేలు విరుగుద్ది.



**-అవ్వారు శ్రీధర్ బాబు**
సెల్: 8500130770

## కదిలే శ్వాస

చక్రాన్ని నేను
ప్రగతిచక్రాన్ని నేను
ప్రగతిబాటకు
వారధిని నేను.
మట్టివాసనలు తోడవ్వ
పంటచేలే నీడవ్వ
రైతన్న పంటకు నేస్తాన్ని నేను
సగటుజీవి ఆశని నేను.

బడుగుజీవుల అడుగులను
మోస్తాను నేను
గమ్యాల దిక్సూచినై సాగే
ప్రజా సేవికను నేను.
నగరమంతటా నవ్వుతూ
తిరుగుతాను
వారు వీరు అనకుండా
గమ్యమే బాటగా.
విలయమై వలయమై వైరస్

స్తంభింపచేయ
నగరాన బందీని నేను
విడిపించరండి..
నను నడిపించరండి...



**-సి.యస్.రాంబాబు**
8374818961

## మట్టిమనిషి

సృష్టికర్త బ్రహ్మ సృష్టించె మనుజుల
అట్టివారుబతుక అవనియందు
ఆకలంటు మనిషికలమటింపులేక
పొట్టనింపు రైతు బువ్వపెట్టి.
ధరణిపైన రైతు దాస్యంబుజేయుచు
ఎంతకష్టమైన ఎదురునిలుచు
నేలతల్లి తోటె నిమిషంబు వదలక
కన్నబిడ్డవోలె కాపుగుండు.
పట్టణాలలోన పనిజేయుజనులంత
పనినిమానుకున్న బతుకగలరు
పల్లెటూరిలోన పనిమాని రైతన్న
ఒక్కపూటనైన ఉండలేడు.
రైతులలిగితేను రాజ్యమందు జనత
పస్తులుండు గతియు వచ్చుచేరు
భుక్తిలేకయున్న భువియందు నరులంత
జీవనంబుగడుప చిత్రమౌను.
ఆదరింపవలయు అన్నదాతనెపుడు
సకలకోటిజనులు సన్నుతించి
రైతువిలువదెలిసి రానీయకిక్కట్లు
పల్లెనగరమనక ప్రణతిజేసి.
పట్టణాలలోన పైస ఎంతున్నను
ఆకలేలదీరు కాస్తయైన
మట్టిమనిషి రైతు మాగాణమందున
పంటతీసి తాను పస్తులుండు.



**-బాలసాని కొమురయ్య గౌడ్**
9912657877

## సాహిత్య యుగకర్త

దేశభక్తి పరుడిగా
మానవతా వాదిగా
వెలుగుజాడ గురజాడ
నిలిచె మార్గదర్శిగా.
వ్యావహారిక భాషను
రాయడంలో వాడెను
వెలుగుజాడ గురజాడ
సాహిత్యాన మెరిసెను.

మంచి చెడులను వివరించె
కులమతాలను నిరసించె
వెలుగుజాడ గురజాడ
కన్యాశుల్కం రచించె.
ముత్యాల సరాలను
రాసె ముచ్చటగాను
వెలుగుజాడ గురజాడ
కథలెన్నో రాసెను.
పూర్ణమ్మలోన కరుణను

కన్యక చెప్పె నీతులను
వెలుగుజాడ గురజాడ
హృద్యంగా పలికించెను.
మహిళాభ్యుదయ వాదిగా
సాహిత్య యుగకర్తగా
వెలుగుజాడ గురజాడ
వెలిగె కవిశేఖరుడిగా.



**-కందుకూరి భాస్కర్**
9703487088

పుస్తక సమీక్ష

# అంతర్జాతీయ అమర యోధులకు.. 'అశోక నివాళి'

లోగడ సింగంపల్లి అశోక్‌కుమార్‌గారు 'అశోక నివాళి' ఒకటి, రెండు భాగాలు వెలువరించి.. తెలుగు అమర వీర సాహితీవేత్తలకు, ప్రముఖులకు అక్షరాంజలి ఘటించారు. ఇప్పుడు.. అంతర్జాతీయ అమరయోధులకు 'అక్షర నివాళి' సమర్పించేందుకు.. 'అశోక నివాళి'... మూడో భాగాన్ని ప్రకటించారు. మహాకవి శ్రీశ్రీ పట్ల అపారమైన గౌరవాభిమానాలను కలిగివున్న సింగంపల్లి అశోక్‌కుమార్ గారు.. మహాకవి శ్రీశ్రీ జేజేలు చెప్పిన సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ అంతర్జాతీయ అమరయోధులకు నివాళి సమర్పిస్తూ రాసిన గ్రంథమిది. ఈ గ్రంథంలో.. యాభై మంది అమర యోధులను ప్రస్తావించారు.. ప్రస్తుతించారు.. ప్రతిభావంతంగా వారి విశేషాలను నిక్షిప్తం చేశారు. శ్రీశ్రీ వివిధ సందర్భాల్లో అంతర్జాతీయ అమరయోధులకు చెప్పిన జేజేలను ఇందులో పొందుపరిచి గ్రంథానికి శోభను కూర్చారు.

సింగంపల్లి అశోక్‌కుమార్‌గారి సృజనాత్మకతతో వెలువడిన ఈ పుస్తకంలో ప్రతి పేజీ.. అపురూపమైనది.. సూక్ష్మంలో మోక్షంలాగా విలువైన సమాచారాన్ని రేఖామాత్రంగా అందించడానికి సింగంపల్లి అశోక్‌కుమార్‌గారు తీసుకున్న శ్రద్ధ అభినందనీయం.. నరనరాన శ్రీశ్రీపట్ల ఆరాధనా భావాన్ని కలిగివున్న అశోక్‌కుమార్‌గారు శ్రీశ్రీ ప్రస్తుతించిన విశ్వ విఖ్యాత అమరయోధులను ఇందులో ప్రస్తావించారు. పుస్తకం ఎడమవైపు పేజీలో.. ఒక్కో అంతర్జాతీయ అమరయోధుడి ఛాయా చిత్రం, దానిక్రింద ఆ అమర యోధుని అభివర్ణిస్తూ.. మూడో పాదం విరుపుతో.. నాలుగు పాదాల పదలయ అంత్యప్రాసల లఘు కవితలను అశోక్‌కుమార్‌గారు రాసి పొందుపరిచారు.

పుస్తకం చివరన వరుసగా అంతర్జాతీయ అమరయోధుల సంక్షిప్త పరిచయాన్ని నిక్షిప్తం చేశారు.

ఇక ఈ పుస్తకంలోని ప్రతి కుడి పేజీలో.. ఆయా అమర యోధులకు శ్రీశ్రీ పలికిన జేజేలను పొందుపరిచారు. అమరయోధుల పట్ల ఆరాధనా భావంతో.. అభిమానంతో.. శ్రీశ్రీ ప్రకటించిన అభినందన చందనాలను ఏర్చి, కూర్చి శ్రీశ్రీ జేజేలుగా అశోక్‌కుమార్‌గారు మనకు అందించారు. అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన విలియం షేక్స్పియర్, ఎడ్వర్డ్ గిబ్బన్, ఆర్.బి. షెరిడాన్, సామ్యూల్ టేలర్‌కోల్రిడ్జ్, పి.బి.షెల్లీ, జాన్‌కీట్స్, జెరార్డ్ డి. నెర్వాల్, ఎడ్గార్ ఎలెన్ పో, చార్లెస్ డార్విన్, కారల్ మార్క్స్, వాల్ట్ మిల్టన్, ఫ్రెడరిక్ ఎంగిల్స్, నికోలాయ్ నిక్రసోవ్, ఎమిలీజోలా, జాన్‌రీడ్, మేలీడ్రస్లర్, సిగ్మండ్ ఫ్రాయిడ్, బెర్నార్డ్‌షా, మాగ్జిమ్ గోర్కీ, లూసన్ తదితర ప్రముఖులతో కలిపి యాభై మంది అంతర్జాతీయ అమరయోధుల ఛాయాచిత్రాలు వారిపై లఘు కవితలు.. వారి పట్ల శ్రీశ్రీ ప్రకటించిన ప్రశంసలను ఈ గ్రంథంలో చూడగలం. వారి వారి జీవన రేఖలను.. ఆయా రంగాల్లో వారు ప్రదర్శించిన ప్రతిభా పాటవాలను రేఖామాత్రంగా తెలుసుకోగలం..

గ్రంథం చివరన.. రచయితల పరిచయంలో విలువైన సమాచారం లభ్యం కాగలదు.. శ్రీశ్రీ పరిచయానికి కూడా సముచిత స్థానం కల్పించడంలో అశోక్‌కుమార్‌గారు సఫలీకృతులైనారు. అంతేగాక అశోక్‌కుమార్‌గారి రచనలు.. ఆయన జీవన ప్రస్థాన సంబంధ సమాచారాన్ని పాఠకులు తెలుసుకునేలా ఈ గ్రంథాన్ని తీర్చిదిద్దారు. ముఖచిత్రంపై అమరయోధుల వర్ణచిత్రాలు బాగున్నాయి.



ఎంతో శ్రమకోర్చి.. ఈ గ్రంథాన్ని వెలువరించి అంతర్జాతీయ ప్రముఖుల జీవన రేఖలను అందించిన అశోక్‌కుమార్ సింగంపల్లిగారికి అభినందనలు తెలయజేద్దాం.

ప్రతులకు: ఆలోచన
305, ప్రగతి టవర్స్
వీరయ్య స్ట్రీట్
మారుతినగర్, విజయవాడ-520 004
సెల్: 9246277375



**-దాస్యం సేనాధిపతి**
సెల్: 9440526644

## లింగమూర్తి

లింగమూర్తి లింగమూర్తి
చక్కని బతుకును మాకివ్వు
చైనా నుండి వచ్చిన రోగం
చిందరవందర చేస్తుంది ॥లింగ॥
కరోనా దీని పేరు కష్టాలే మారుమోగే
కూటికి పూటకు గతిలేక పేదోల్లు సావవట్టే
రాష్ట్రపతిని మొదలిడి రాళ్ళెత్తే కూలీ దాకా
అందరినీ ఆగమాగం చేయబట్టే ఈరోగం
॥లింగ॥

చేతికి తొడుగులు తొడిగి తిమి
మూతికి ముసుగులు వేసితిమి
దూరం దూరంగ జరిగితిమి
భయం భయంగ బతికితిమి
॥లింగ॥

కోవీడను పేరుతోనీ
కోరలు సాచి సాగవట్టే
కోటి మంది చచ్చినా
కోరిక తీరక చెలగవట్టే
॥లింగ॥

ఢమరుక నాదం వినిపించి
దానిని అదరగొట్ట రావయ్యా
తాండవమాతు నీవచ్చి
తరిమి తరిమి కొట్ట వయ్యా
॥లింగ॥



–రాంనరేష్ కుమార్
9492682285

## కరోనా పారిందనీ..

కరోనా పారిందనీ
కరిగే కొవ్వొత్తి గాకు
చేపలా ఎదురీదుతూ
చాకచక్యమైన ధైర్యంతో
గుండులాంటి ఆత్మస్థైర్యాన్ని
గుండె నిండా నింపుకొని ఉండు
ధైర్య మనస్సుతో..
వేడి పానీయాలను
ఉడుకు పదార్థాలను
ఉడికించిన గుడ్లను
మొలకెత్తిన గింజలను తింటూ
యోగాసనాలను వేస్తూ
యోగిలా ధ్యానమూ చేస్తూ ఉండు
ధైర్య ఆలోచనలతో..
వైరస్‌లు వచ్చేది
మైనస్ లు కావటానికేననీ
మనసులో గట్టిగా అనుకొనీ
మనఃశ్శాంతితో ఉంటూ
ఆత్మవిశ్వాసంతో కరోనను
అంతమొందించేసి
అందరికీ ఆదర్శమౌదాం..

నీ ఆలోచనా తీరూ
నీ ధైర్యమే నిన్ను
నిల్చి గెల్చేలా చేస్తుంది..



–కొక్కె రాములు
9985341992

## కర్మయోగి

స్వాప్నిక జగత్తులో విహరిస్తున్నాడు
చీకటి వెనుక వెలుగును లోకానికి
చూపాలనే విశ్వప్రయత్నం చేస్తున్నాడు
ఖాళీ ప్రేగులను కడుపు సంచిలో వేసుకుని
చంకన జోలెలో విజ్ఞానాన్ని పోగేస్తున్నాడు
పలక మీద గురువు పెట్టిన భిక్షను
మనసులో వల్లె వేసుకుంటూ
సమాజగతిని ప్రశ్నించాలని తపిస్తున్నాడు
ఉచితాలకు నోచుకోని బడుగుజీవి
కండలేని ఎముకల మీద కప్పిన చర్మాన్ని
జీర్ణవస్త్రంతో కప్పుకుని సాగిపోతూ
రుధిరాక్షరాలతో చైతన్యదీపిక వెలిగిస్తున్నాడు
మూడుముళ్ళ తాడు మార్వాడీ తాకట్టు నుంచి
వెలికిరాలేక కొలిమిలో కరిగిపోయింది
కాగితాల కట్టను భుజాన వేసుకుని
భేతాళుని మోసే విక్రమార్కుడిలా
మెట్ల పూజలు చేస్తూనే ఉన్నాడు
అక్షర కర్షకుడిని ఏ ముద్రణా ఆదరించలేదు
వసంతం కోసం ఎదురుచూసే తరువులా
మెరుపు కోసం చూసే రైతు బిడ్డలా
శ్రమ ఎరుగని చీమలా కదులుతున్నాడు
సాలీడులా కవనతీగెను అల్లుతూనే ఉన్నాడు
అతనొక నిరంతర శ్రామికజీవి
తెలుగుతల్లిని నమ్ముకున్న భాగ్యజీవి
ఆకలిని త్యజించిన కర్మయోగి



–శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## వేకువకై... వేచిఉన్నా

అంటరానితనం నేడు
మానుషత్వం!..మానవత్వం!
జీవనసాగరంలో
అంటిఅంటని బంధాలతో
సాగి పోతోంది ప్రేమనౌక
మనిషికి మనిషికి మధ్య
గాలిగోడలులేచాయి!
మనస్సుహస్తాలకు
వ్యాధిసంకెళ్ళు బిగించుకున్నాయి!
కోటికోట్ల మానుషానందం
పరిమితమై పల్లవిస్తుంది!
ఈవేళ వేలవెతలదైన్యం
దూరమై భారమై
దుఃఖపు పర్వతాన్ని నెత్తికెత్తింది!
మళ్ళీ మనిషి శ్వాస
వేయిరేకులతో విచ్చుకొని
పరిమళించేదెపుడు?
ఆ వేకువకై
కోట్లతనువులతో వేచిఉన్నా.

–డా.పింగళి గంగాధర్ రావు
7013072972.

## నాగరికత

దీపావళి కొక్కసారి
రంగులేసుకుంటిమి
బ్యాక్టీరియా వైరస్‌లను తరిమి తరిమి కొడితిమి
రంగులకే లచ్చులాయే
పదేండ్లకొక్కసారి
పాడుబడ్డా పాచిబడ్డా సున్నమేయ నామోషాయె.
సీలింగ్‌లు పుట్టిలాయే
శీతలీకరణ యంత్రములాయే .
అన్నిపనులు
యాంత్రికమే
భౌతిక ప్రాణం బలహీనమే.
చిన్నరోగమొస్తె చాలు
సీలింగ్‌లు కూలబట్టె
రోగానికి తట్టుకోక
పుట్టిమొత్తం మునగబట్టే.
నాగరికత పేరుతో
గరిక లేకుండ
చేస్తిమి
గజం లెక్క భూములమ్మి
కోట్లకు పడగెత్తితిమి.
గాయి గాలి రోగమొస్తె
గంటకు లచ్చలు పెట్టి గాలిగొట్టం పెట్టిన
పాణాలు నిలువవాయె.
క్యాన్‌నీల్లు కాపడలే
ఆల్కలీన్ అడ్డుకోలే
చేదబావులున్నపుడు
నీల్లు చేదుకున్నపుడు
సక్కంగ ఉంటిమి
సల్లంగ బతికితిమి.
ఇరుకు గదుల ఇండ్లలో బతకడం మానాలి
అటాచ్డ్ మలినాలను
డిటాచ్ చేయాలి.
మంచె ఎపుడు ఇల్లుకాదు
కూలబడె పనులు వద్దు
మంచివైపు పయనిద్దాం
భయం లేక బ్రతికేద్దాం.



–కొమ్మిడి గోవర్ధన్‌రెడ్డి
9701841186

# అనిర్వచనీయ బిక్కి కృష్ణ కవితా నిర్వచనం...



అతడు– మారుమూల పల్లె పాడిన పాట సాహితీ మాకుంద రస ఊట. కవితా సుగంధాల తేట. మట్టి పరిమళంతో సాహితీ మనికిని

మహోన్నతంగా నిలిపిన మేటి.

అతడు– కవితా లోకపు అలోకనమై "కొత్త కోణం" చూపిన సాటిలేని ఘనాపాటి. 'కవిత్వం–డిక్షన్'తో కొత్త కవితా క్రాంతి బాట. అతడు సాహితీ దిక్కుల్ని, దృక్కుల్ని కలగలిపిన ఉద్యమకారుడు. అతడు–దేశానికి మువ్వన్నెల జెండాలా కవన లోకాన తన

అవగాహనానుభవానుభూతులను కవితా పతాకాలుగా ఎగురవేసినవాడు. తన కవితా కిరణాలను వేకువ పిట్టలుగా లోకం పైకి ఎగురవేసిన వాడు.

అతడు... .అతడే.... కవిత తత్వం తెలిసిన–తెలిపిన కళారత్న బిక్కి కృష్ణ.

కవి అంటే... కవిత ఎలా పుడుతుంది – కవిత రాయాలంటే – కవిత ఎలా రాయాలి– కవిత్వమంటే – అంటూ కవిత్వానికి

సంబంధించి వివిధ అంశాలను గురించి బిక్కి కృష్ణ మనోగతాభిప్రాయావిష్కరణను అవలోకిద్దామా....

నిష్కల్మషమై బహిరంతర నేత్రాలతో అక్షరాలను, సమాజాన్ని తరచి తరచి వాటి తత్వం తెలుసుకుని, అక్షరాయుధాలకు పదును పెట్టటం నేర్చుకుని "అగ్గిలాంటి నిజాలను మోసుకొచ్చే కొరియర్స్ నా అక్షరాలు" – అంటూ తన అక్షర శక్తిని వివరించారు బిక్కి కృష్ణ. అంతేకాదు. – లక్షల మెదళ్ళను కదలించే అక్షరం నేనైపోయా – అన్నారు. అక్షరాలలో తనను నిక్షిప్తం చేసుకున్న అపూర్వ–అద్భుత అక్షర సాహిత్యం బిక్కి కృష్ణ.

నిమ్నోన్నతుల వైవిధ్య భరిత జీవిత–.. జీవనానుభూతుల నేపథ్యంలో పలు బాధల గాథల నలుగుతున్నా ఆత్మ సంయమన శక్తితో ఆత్మ జ్ఞానంతో మేథా సంపత్తితో అమేయ కవితా శక్తితో విలువలకై నిలచి నిరంతరం అసలు సిసలైన కవన సేద్యం చేస్తున్న బిక్కి కృష్ణ దృష్టిలో – వ్యక్తితం లేనివాడు కవియైనా వ్యర్థుడే. కవి స్పందించే గుండె ఉన్న పూల చెట్టులా, కవితల పూల రథంలా ఉండాలంటారు. సమతతో ప్రేమ తత్వంతో సమాజ హితా కాంక్షియైన వాడే కవి అంటారు. కేవలం కలం పట్టినవాడు కవి అనబడడని, కులం రంగు అహం రంగు చెరుపుకొని చెప్పేది రాస్తూ, రాసిందే ఆచరిస్తూ మానవత్వమై వ్యాపించేవాడే కవి అంటారు.

అందుకే – పువ్వై వికసిస్తే సరిపోదు. పండై రాలిపో (నలుగురికి ఉపశమనమిస్తూ నలుగురికి ఉపయోగపడుతూ ఉండటం) అపుడే నీవు కవివి– అంటారు. సమాజానికి చేతనా చైతన్యానివ్వని వాడు కవే కాదంటారు. తానో కవిత్వపు పంట చేనై కవిత్వాన్ని జీవితంగా జీవితాన్ని కవిత్వంగా కలబోసుకున్న పెనవేసుకున్న కవి బిక్కి కృష్ణ. కనుక 'ప్రజలే కళ్ళు కవితల ఆనవాళ్ళు' అనే కృష్ణ 'లోక హితం కోసం కలం ఖడ్గం ఝళిపించే కవిని నేను' అని చెప్పుకునే కృష్ణ

'అక్షర సేనానివి నీవు

దేశానికి రక్ష నీవు' – అంటూ కవిని నిర్వచించాడు. ఎందుకంటే – అతడు– విరిసే పూలను, ఎగిరే గువ్వలను, కురిసే చినుకుల్ని, చినుకున తడిసే నేలను, తుళ్ళే తువ్వాయిని, తోకాడిస్తూ తిరిగే కుక్కను, అనుభవాల పండిన అవ్వను, వెన్నెల తడిసే గుడిసెల గుండెలను చూస్తూ కవితా కదమై కురుస్తున్న వారు కృష్ణ అందుకే కవిని లకుముకి పిట్టగా, సూర్యుని తోబుట్టువుగా, తోటమాలిగా, గౌతమ బుద్ధునిగా వర్ణించటమే కాక కవి అంటే ఇంద్రజాలికుడు అంటా కొత్తగా నిర్వచించారు.. ''భావ సమాధిలో నిమగ్నమైన రుషిలాంటి కవి మాత్రమే – అక్షరాల పూరేకులపై ఆత్మ జలం సంప్రోక్షించి దృశ్యాలకు రంగులద్ది (ఇమేజెస్, ప్రతీకలు వగైరా) కవిత్వపు చిత్ర పటాలను గాలిలోకి ఎగురవేయగలడు – అంటూ కవి కవితా శక్తిని వివరించారు కృష్ణ.

అందుకే, కవి అంటే చిత్రకారుడు, ప్రేమికుడు, ఆరాధకుడు, రసలోలుడు, దార్శనికుడు అంటూ కవి యొక్క వివిధ పార్శ్వాలను ఆవిష్కరించారు. ఈ నిర్వచనాలన్ని నిజమే అనిపిస్తుంది.

ఎందుకంటే – కవి రాసిన పదాన్నో పద్యాన్నో మరేదో సాహితీ ప్రక్రియనో చదివినపుడు దాని తాలూకు ఓ దృశ్యం



చిత్రంలా మన కళ్ళముందో, మనసులోనో కనబడినపుడు కవి నిజంగానే చిత్రకారుడు. సర్వ ప్రాణి కోటి పట్ల, ప్రకృతి పట్ల, మానవత్వాన్ని, ప్రేమ తత్వాన్ని అక్షరాలలో అక్షయంగా వర్ణించే కవి ప్రేమికుడే. సర్వ ప్రకృతిని ప్రాణుల కదలికలను పరిశీలనగా చూస్తూ తన్మయమై మనసారా వాటిని ఆనందించే ఆ ఆనందాన్ని అక్షరాలలో ఆవిష్కరించే కవి ఆరాధకుడే. సమాజ ప్రవృత్తుల అనుభూతుల్ని ప్రదర్శిం చే కవి రసానంద మూర్తి కనుక కవి రస లోలుడు.కాలం కౌగిలిలోనే ఉన్నా దాని ఆవల ఏముందో గ్రహించి చెప్పే కవి దార్శనికుడు.

మరి అటువంటి కవిలో కవిత్వం ఎప్పుడు ఎలా ఆవిర్భవిస్తుంది అంటే –..'దేనినైనా తదేకంగా చూడటం లీనమై పోవటం తనని తాను మరిచి పోవటం అనుభూతించటం తనలోని మనస్తాని ఒంపుకుని దృశ్యాలకు చిత్రాలుగా గీయటం – చేసినపుడే' కవిత్వం జాలువారు తుందంటారు కృష్ణ. ఇలా నిత్యం కవిత్వం కోసమే కలవరిస్తూ –

**"కట్టెను రంపం కరకర కోసినపుడు**
**పొట్టు రాలిపడినట్టు**
**గుండె పండును బాధ గట్టిగా పిండినపుడు**
**నీలో కవితా రసం బొట్టు బొట్టుగా రాలి పడుతుంది'** – అంటారు కృష్ణ.అంటే బాధ నుండి కవిత్వం పుడుతుందన్న మాట, ఆర్ద్రత, ఆవేదన, ఆవేశం, విషాదం వంటి వాటికి స్పందించే మనిషి అనుభవించే సహజ ప్రవృత్తుల నుండి కవిత్వం పుడుతుంది అని తెలుస్తోంది కదా–

నింగి, నేల, గాలి, నీ ముందున్న మనుషులు, పశువులు, పక్షులు, చెట్లు, సమస్త దృశ్యాలను నీలోకి ఒంపుకోవటమే ప్రేమంటే. ప్రేమ తత్వమున్న కవిలో నుండే కవిత్వం వెలువడుతుందంటారు కృష్ణ.

**"భద్రత బతుకులో ఉద్రిక్త కవిత్వం ఎలా పుడుతుంది. కవీ**
**బతుకు ఛిద్రమైన కవి మాత్రమే**
**గొప్ప కవిత్వం రాస్తాడు** – అంటారు కృష్ణ.. అందుకు తానే గొప్ప నిదర్శనం అంటారు. "కన్నీటిలో అక్షరాలను శుభ్రపరచనివాడు కవి ఎలా అవుతాడు" – అనే కృష్ణ మాటలు అక్షర సత్యం.

మరి అలాంటి పరిస్థితుల్లో కవిత్వం రాయాలంటే –

**"కవి తనలోని పశుత్వాన్ని చంపి**
**రుషిత్వాన్ని మేల్కొల్పటం**
**అపుడపుడు ప్రకృతి ముందు, ప్రియురాలి**
**ముందు పసిపిల్లాడై పోవటం"** చేయాలి. అపుడు మాత్రమే

**"శిశు తత్వం రుషి తత్వం గుండె నిండా**
**నింపుకున్న కవి మాత్రమే దేహంలోని**
**ఉద్వేగపు ఉప్పెనల్ని గొప్ప కవిత్వ భాషగా**
**మార్చగలడు"** – అంటారు కృష్ణ

అంతేకాదు – **" తన దేహపు అవయవాల తడిమళ్ళలో నరాల తీగెల స్పందనల్ని అక్షరాలుగా,పదాలుగా, పద్యాలుగా, పాటలుగా మార్చగలడు'** – అని కూడా అంటారు.. ఎంతో నిజమిది.

అంత మథనంతో మనసు అణువణువును తరచే స్పందనా, సాంత్వనా సరాలను పూల జల్లుగానో, వాన జల్లుగానో కురిసే ఆ కవిత్వం అంటే –....

కవిత్వం అంటే 'ఇది' అంటూ ఎందరెందరో తమ అభిప్రాయాలను తేటతెల్లం చేశారు. వాక్యం రసాత్మక కావ్యం – అని విశ్వనాథుడు,

రమణీయార్థ ప్రతిపాదక శబ్దం కావ్యం – అని పండితరాయలు, కవిత్వం ఆత్మకళ...అని

శేషేంద్ర.. ఇలా మన భారతీయ ఆలంకారికులు, 'All good poetry is the spantanious over flow of powerful thoughts' అని వర్డ్‌వర్త్, It tells it's oregin from emotion recollected in tranquility అని, poetry is the critieism of life అని, poetry is language of imagination and the passion అని పాశ్చాత్యులు కూడా కవిత్వం ఇదని నిర్వచించారు.

ఎగరేసిన మానవతా పతాక"'అని నగ్నముని గారిచే ప్రశంసింపబడిన కృష్ణ 'లోక హితం కోసం కలం ఖడ్గం ఝళిపించిన కవిని

నేను' – అనే కృష్ణ ప్రేమతత్వమే కృతజ్ఞతా భావమే కవితాతత్వం అనే కృష్ణ కవిత్వాన్ని ఎలా నిర్వహించారో చూద్దామా. తను రాసిన గజళ్ళ

సంపుటి 'వల్లరి'లో –

**రససిద్ధుడైన కవి కళ్ళలో మెరిసే**
**కాంతి కదా కవితంటే**
**ఆ బుద్ధుని గుండెలో విరిసిన**
**శాంతి కదా కవితంటే**
**పులకింతల రుతువై కురిసిన**
**పూబంది కదా కవితంటే** – అంటారు.

"బతుకు కన్నీటి కెరటమే కావచ్చు కానీ కెరటాలే నాకు ఆదర్శం. ఎందుకంటే అవి నిరంతరం కనిపించని, కాలం .వంతెనపై అలుపన్నదే లేక ఎగసిపడుతుంటాయి... అని చెప్పి ఆ కెరటాల లాగానే కవిత్వం కోసం కవితోద్యమమై సాగుతూ ఎందరో



నవ యువ కవులకు మార్గదర్శకమైన బిక్కి కృష్ణ తాత్విక రచనా సృజనకారుడైన బిక్కి కృష్ణ –" అణగారిన సమూహాలను పోరుబాట పట్టించేదే అసలైన కవిత్వం – అని, ఆకలి కేకల గుడిసె?లో గెరిల్లా యుద్ధ వీరులకు ఊపిరి పోసేదే నిజమైన కవిత్వం –... అంటూ కవి సామాజిక బాధ్యతను ఎత్తి చూపించే కృష్ణ 'వాన వెలిశాక' అనే తన కవితా సంపుటిలో కవిత్వం అంటే అంటూ –

**"కనిపించని గాలి పూల రెమ్మలను ఊపినట్టు**
**లిపిలేని భావాలేవో నిన్ను ఉక్కిరి బిక్కిరి చేసినపుడు**
**నీ గుండె గిజిగాడు నేర్పుగా అల్లుకునే**
**గూడే'కవిత్వం** – అని, మరోచోట –.....
**"పెన్నుని గన్నుగా అడవిపై విసిరేసిన**
**మృత వీరుని కనుగుడ్డులో మెరిసే ఆఖరి**
**మెరుపు తీగె కవిత్వం –"** అని, ఇంకొక చోట కవిత్వమంటే ప్రియురాలితో సల్లాపమని, ప్రేమను ప్రేమించటమని, కవిత్వమిదని చెప్పటంలో నవ్యతను ప్రదర్శించారు. వేరొక చోట – మనిషిలోని మానవత్వాన్ని మేల్కొల్పటం కోసం మనసున్న మనిషి చేసే నిరంతర అన్వేషణే కవిత్వం – అంటూ ఎంతో ఉదాత్తంగా నిర్వచించారు కృష్ణ. సమాజంలోని వ్యక్తులందరూ కవులుగా మారితే సమాజం శాంతిమంతమౌతుందనే ఉద్దేశంతో, లక్ష్యంతో చేసే తన నిరంతరాన్వేషణను ప్రతిబింబం ఈ నిర్వచనమే.

"ప్రతి మనిషి తన కళ్ళ కలశంలో దాచుకున్న కన్నీటిని కనురెప్పల తమలపాకులతో తడిపి విదిలిస్తే అవి నేలంతా కవితల మల్లె

మొగ్గలై గుభాళించాలి– చెప్పే విషయాన్ని ఇలా అందంగా, కవితాత్మకంగా చెప్పటమే కవిత్వం అనేది కృష్ణ ఉద్దేశం. ఇంకా –...

**"కవి నవ్వితే**
**కవిత్వం పూలజల్లులా**
**పెదవులపై నుండి జారిపడాలి.**
**కవి ఏడ్చినా కవిత్వం హోరు గాలిలా**
**కనురెప్పల్లో తుఫానులా ముసుర్లు కమ్మాలి– "**
అంటూ ఆనంద విషాద భావాల ముప్పిరిగొన్న స్పందనా సమూహాలను అందంగా ఆవిష్కరించటమే కవిత్వమని హృద్యంగా చెప్పారు.

"కాగితాలపైనో, కంప్యూటర్‌పైనో చెకుముకి పిట్టలా నాలుగు పదబంధాలను, రెండు భావ చిత్రాలను చెక్కినంత మాత్రాన అది చిక్కనైన కవిత్వమై పోతుందా – అని సూటి ప్రశ్న వేస్తూనే అలాంటిది కవిత్వం కాదని చెప్తూనే

**"దృశ్యాలను సృష్టిస్తే సరిపోదు. కవిత్వంగా**
**శిల్పీకరించాలి – అని సూచనను చేశారు.**
**"కావ్యం యశసే అర్థకృతే"** అంటూ మన అలంకారికులు కవిత్వ ప్రయోజనాన్ని గురించి చెప్పారు. ఐతే కృష్ణ కవిత్వంలో నవ్యత ప్రధానమని చెప్పుకున్నారు కదా అందుకే – ....

కవిత్వం ఆకాశంలో ఉన్న సూర్యులను అడవికి

> **"సర్వ ప్రాణి కోటి పట్ల, ప్రకృతి పట్ల, మానవ త్వాన్ని, ప్రేమ తత్వాన్ని అక్షరాలలో అక్షయంగా వర్ణించే కవి ప్రేమికుడే. సర్వ ప్రకృతిని ప్రాణుల కదలికలను పరిశీ లనగా చూస్తూ తన్మయమె మనసారా వాటిని ఆనందించే ఆ ఆనందాన్ని అక్షరాల లో ఆవిష్కరించే కవి ఆరాధ కుడే. సమాజ ప్రవృత్తుల అనుభూతుల్ని ప్రదర్శిం చే కవి రసానంద మూర్తి కనుక కవి రస లోలుడు"**

కాపలా ఉంచగలదు– అని ఉత్తమ కవిత్వ ప్రయోజనం గురించి చెప్పారు.

అలాంటి కవిత్వం గురించి చెప్తూ – కవిత్వం కారాదు కొరుకుడు పడని విత్తనం. వినినంతనే ఎద పొంగాలి. అనంత నవ చైతన్యం – అంటూ కవితా నిర్మాణం ఎలా ఉంటే బాగుంటుందో చెప్పారు. భావ వ్యక్తీకరణలో ఏ విధమైన క్లిష్టత లేకుండా నవ్యాతి నవ్యమైన

వ్యక్తీకరణలుండాలని కృష్ణగారి మార్గదర్శకత్వం. ఈ విషయాన్ని వారు రచించిన "కవిత్వం–డిక్షన్"లో ప్రత్యేకించి చెప్పారు. 'పాడిందే పాటరా' అనే ధోరణిని వదిలి చెప్పే విషయం ఎవరూ.... నడవని దారిలా ఉండాలనే అంటారు. అంటే ఎవరూ చెప్పని విధంగా కొత్తగా చెప్పాలని అర్థం. ఆయా అంశాలలో వాటి ప్రతీకలు, ఇమేజెస్ మొదలైనవి – అంతకు మునుపెవ్వరూ వాడనివై ఉండాలంటారు. రోజూ చూసే సంగతినైనా సరికొత్తగా చెప్పాలంటారు ఈ 'కవిత్వం–డిక్షన్' సృష్టికర్త.

కవితా సహస్రాంశుడై తన కవితా తేజస్సుతో అందరికి ఆనందమిస్తూ ఆశ్చర్యమనిపిస్తూ ముందు తరాల బాధ్యతను వహిస్తూ –

**"పిల్లలకు చదువుతో పాటు కవితాక్షరాలను నేర్పించండి అని రస సంజీవనులై ప్రాణాలను నిలబడతాయి. రక్షక కవచమై చిరంజీవులను**
**బతికిస్తాయి. చనుబాలై జాతిని పోషిస్తాయి'** – అంటూ,
**" ఆ ఆకాశమంత హృదయం మీకుందా"**
అంటూ నిలేస్తున్నారు నిలదీస్తున్నారు బిక్కికృష్ణ
**"కడుపు నిండిన వాడు రాసే కవిత్వం పగటి కల**
**కడుపు మండిన వాడు రాసే కవిత్వం రగిలే జ్వాల"** – అంటూ

కవిత్వంలోని మౌలికమైన వ్యత్యాసాన్ని అద్భుతంగా చెప్పారు.

నిజానికి ' ఈ నేల ఎందరు కవులను



చూచిందో.... కానీ, ''కవిత్వం నాలా ఉంటుందన్న" ధీరోదాత్త కవిని చూసి ఉండదు.

భూగోళపు కనుగుడ్డవై కవితా రోజస్సులతో నిత్య అరుణోదయమై నిలచిన కవిత్వం గురించి ఇంతగా చెప్పిన బిక్కి కృష్ణ లాంటి కవిని అసలు

చూచి ఉండదు అంటే అతిశయోక్తి కాదు.

ఔను అతడు అక్షరా యుధాలతో ఇజాల నిజాలను నిలువరించినవారు. అతడు ఉదయించే ఉషస్సులా నిట్టూర్పు లెరుగని ఆశయాల ఊర్పుల సాగుతూ సుఖాల స్నేహాన్ని వదిలి కష్టాల తుఫానుల్ని సంయమనమనే గొడ్డలితో నరుకుతూ కవిత్వంగా వెలుగుతూ కవితా ఆత్మగానంతో అందరిని ఆవహించిన వాడు.

ఔను అతడు కవిత్వం మనసుకు పరిమళం పరవడం అద్దే మరు మల్లెల పల్లకి. అనుభూతులతో నినదించే సుస్వరాల కంజర.

ఔను... అతడు ప్రజల గుండెల్ని పూల దండలుగా మెడలో ధరించి తిరుగుతున్న కలల బేహారి.

*( ఈ వ్యాసానికి ఆధారం చినుకు, కాలం నది ఒడ్డున, వాన వెలిశాక అనే గ్రంథాలు..)*



–రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
9866583907

## వాడిన మ్రోడులైనది

పట్నంలో పంతులు నౌకరి జేత్తున్న నేను
ఈ మధ్యనే పని మీద మా ఊరికెళ్ళిన
పట్నములోని
ప్రైవేటు బళ్ళే పాఠాలు జెప్పే ఎంకన్న
మోటారు సైకిల్ మీద పిండి బత్తాలేసుకొని
బాయికాడకి?బోతు ఎదురయిండు

నీడపట్టునుండి నిగనిగ లాడే ఎంకన్న
నల్లకట్టోలే మారి నారాజుగ కనబడ్డడు

ఏందిర ఎంకన్న ఏషం మారింది
ఎవుసం మళ్ళెప్పుడు మొదలు బెడితివంటి
ఏముంది బాబాయ్
కరోనా దెబ్బకు ప్రైవేటోడు కడుపులు గొట్టే
నమ్ముకున్న సదువు నట్టేట ముంచిన
వారసత్వంగా వచ్చిన కస్కీ
అయ్యవ్విచ్చిన కొంద్రే
ఆకలి దీర్తదన్న ఆశతో
మల్లగీ మట్టిల బొర్లుతున్న
మట్టిని నమ్ముకున్నోడు
సెడిపోలేదంటరు కదా
అందుకేనే
కలము కన్నీరుబెట్టిచ్చిన
హలము ఆపద దీరుస్తుందని
మళ్ళీ పొలము బాటపట్టిన

కష్టమో నష్టమో పనైతే మొదలు బెట్టిన గాని
పానం నిమ్మళంలేదే
అలవాటు దప్పిన పనికి
అలసట ఎక్కువాయే
ఇగ ఊళ్ళే జూత్తే మునుపటి
పోవటెక్కడున్నదే
ఆదర్శాల సద్దిమూటలన్ని అంగడి సరుకై
అదుపు తప్పి
అవకాశవాద రాజకీయాల్లో రాటుదేలి
నాలుగు రాళ్ళు ఎనుకేసుకున్నోళ్ళే
నాయకులై ఎలగ బట్టె
ఎవన్ని మందలిద్దమన్న
ఎకసెక్కెంగ హేళన జూడబట్టే
లోకం పోకడ గూడ మారిందే
ఎట్లబతుకుతున్నమన్నది లెక్కేలేదు
ఎంత ఎనుకేసిండ్లన్నదే లెక్క
ఇగ కోడెకచ్చు పోరగాండ్ల సంగతి సెప్పలేమే
మూతికి మీసం రానోడు కూడ
మూత దీసిండంటే
సిటికెలో సీస ఖాలిజేత్తాండే
బంగారం లాంటి పొల్లగాళ్ళ బతుకు
కళ్ళముందు కుదేలవుతున్నా
భ్రమల్లో ఊరేగుడే కాని
తప్పని జెప్పటోడే లేడే
న్యాలబడుతాంటే నవ్వేటోళ్ళే ఎక్కువయిండ్లే
ఏ లెక్కలజూసిన మనుషుల
లెక్కలు మారినయే
అంటూ మనాది తోటే కదలిండు ఎంకన్న.



–గన్ రెడ్డి ఆదిరెడ్డి
9494789731

## నా దేశం

నా దేశం
నా దేశం మహోన్నతమైనది
సంస్కృతి సంప్రదాయాలతో సుభిక్షమైనది
దేశాలన్నింట నాదేశం లెస్స
భాషలన్నింట తెలుగే లెస్స
ఇది వేదభూమి
రాముడేలిన పుణ్యభూమి
పాడిపంటలతో అలరారి సస్యశ్యామలమై
అన్నిదేశాలకు తలమానికమై
అన్నిరంగాలలో అభివృద్ధిచెదుతున్న నాదేశం
ఈనాడు తిండిలేక ఆకలిచావులు,మృత్యుఘోషలు
పనిచేసుకునే దారిలేదు ఆకలేమొ ఆగదు
భరతావని నేడు బోరున విలపిస్తున్నది
ప్రపంచమే అల్లాడిపోతున్నది
ఇది విషమకాలం
కరోనా మృత్యువై కాటేసేకాలం
నిరంతరం మాయాజాలం
ఎంతవరకో దీని చలాయింపుకాలం
ఎక్కడిదీ మహమ్మారి
విషంగ్రక్కే దేశదిమ్మరి
బయటకెళ్ళితేభయం
ఇంట్లోఉంటేనే నయం
క్షణక్షణం అయోమయం
వైద్యులు,పారిశుద్ధకులు చేస్తున్నకృషి అభినందనీయం
దేవుడున్నాడో లేడో తెలియదుగాని
ఈ స్థితిలో వైద్యుడేదేవుడు నారాయణుడు
దేశాన్ని రక్షించేశక్తిలేదా?
మన పరిశోధకులకు సాధ్యంకాదా?
ఆ రోజు త్వరగా రాదా?
జగమంతా రోదనారణ్యం
అంతవరకు గృహమే శరణ్యం
కరోన అంతమగుగాక.



–ఎలగందుల లింబాద్రి
7659834393

## ప్లాస్టిక్ బాంబు !?

అణుబాంబు మించిన బాంబు
ప్లాస్టిక్కంటే మనకు నమ్మబుద్ధి
కాదు గానీ..
సప్తసముద్రాల్లో.. నదీ నదాల్లో
పచ్చటి పొలాల్లో.. అందమైన దృశ్యాల్లో
వాగుల్లో వంకల్లో డొంకల్లో
భూగర్భపొరల్లో డ్రైనేజీ మురుగులో
ప్రతి ఇంటిలో.. మనందరి వంటిలో..
గోమాత గర్భాల్లో.. పసిపాపల చేతుల్లో
సర్వాంతర్యామిలా వ్యాపించింది ప్లాస్టిక్
భూమండలాన్నంతా కమ్మేసి
మానవాళి మనుగడనే సవాల్ చేస్తూ..
మనచేతుల్లోనే దాగి
నిశ్శబ్దంగా వరదలు తుఫాన్లు
కాలుష్యం రోగాలతో
మన పీకే నొక్కేస్తోంటే.. దిక్కు తోచక
ప్లాస్టిక్కి బానిసలమై..
వదల్లేక వదిలించుకోలేక
క్షణక్షణానికి.. అధఃపాతాళానికి
జారిపోతున్నాం.. ఫ్
మనం తల్చుకొంటే
ఈ భూతాన్ని వదిలించుకోలేమా ?
ప్లాస్టిక్ రహిత ప్రపంచాన్ని
సృష్టించలేమా.. ఆలోచించండి.. !!



–భీమవరపు పురుషోత్తం
సెల్ : 9949800253

## డిజిటల్ విద్యా

విషపురుగు విశ్వమంతా ఇసురుకొని
విశ్వరూపం చూపిస్తుంటే
భూగోళమంతా మాస్కు వేసుకొని
అనుమానపు గోడల మధ్య
భయం నీడన బతుకుతుంది

కరోనా కాలసర్పంతో
బడులు బంధాయే
పోరగాళ్ల కు రందాయే
పేరెంట్స్, పంతులకు బెంగాయే
పిల్లల భవిష్యత్తు ఫికరాయే

విద్యా వ్యాపార మై
చదువుల తల్లి సరస్వతిని
సంతలో సరుకును చేసి
ప్రైవేట్, కార్పొరేట్ వాళ్లు
ఆన్లైన్ క్లాసుల పేరిట
కాసులు గుంజుతున్రు ,కంగారు పెడుతున్రు

ఆన్లైన్ చదువుల కోసం
అవునమ్మి స్మార్ట్ ఫోన్ కొనిచ్చి
కోరిక తీర్చిన తల్లిదండ్రులు కొందరైతే
కండలు కరిగించి కొన్నోళ్లు మరికొందరు
పిల్లలకోసం తల్లిదండ్రుల తండ్లాట
ఫ్యూచర్ కోసం పాకులాట

ఇంత చేసినా ఫోన్లో కనిపించి కొంత,
వినిపించక కొంత
సిగ్నల్ లేక కొంత,
రీఛార్జ్ రిస్కు మరికొంత
సదువు సంగతి దేవుడెరుగు గానీ
కండ్లు గుంజ బట్టే, తలకాయ తిరగబట్టే
బాల్యం బందీయై , గుండె చెరువై
డిజిటల్ విద్యకు దూరమవుతున్రు
భవిష్యత్తు అంతా కొండెక్కుతుంది

– తాటిపాముల రమేష్
7981566031

## జర జాగ్రత్త...

కరోనా కాలంలో
విచ్చలవిడిగా తిరిగితే
విద్యుత్ తీగెలపై
వ్రేల్లాడినట్లే

మాస్కులు ధరించి,
దూరం పాటించు,
కంటిని, నోటిని,ముక్కును
చేతులతో తాకకు.

తరచు చేతులు కడుక్కో
నిన్ను నువ్వే కాపాడుకో..



– యెల్డి సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067





# చేనేత

- వసంత ఇంజపురి
9618017234






దూది పువ్వులు తెచ్చి
శుభ్రంగా దూదొలుచు
వత్తులుగా చే బూని
రాట్నంకదురు చుట్టించు
భళా నేతన్నల నేర్పు
పద్మశాలీలదే ఓర్పు

డబ్బాల రాట్నం తీసి
డబ్బకెక్కెంచు దారం
ఆసుపై ఆసుపోసి
పడుగు పోద్దురు దారం
ఆహా! చేనేతపనితనం
అబ్బుర పరుచునుదినదినం

తేజాబ్, నూనె, ఆముధం,
పటికి, క్యాట్రిక్, రంగులు
కలిపి బాగా మద్దించి
నూలుకు కద్దురు రంగులు
జాడించి ఆరేయా
రంగుదారాలై మెరుసు

పెట్టెలో ఇరవై లడిలు
ఒకలడి ఐదు చిట్టాలు
ఒక చిట్టెకు ఏడుదిండ్లు
ఒక చీరకు ఐదు లడిలు
వారెవ్వా దారాల లెక్కలు
అర్థమవతుందు లెక్కించుకొద్ది

కండెల రాట్నం పై
చిట్టెలను ఎక్కించి
పొట్టె పొట్టెను పాపి
దారంచుట్టు చుట్టించి
తుమ్మెదా గానంలా
దారం కదురుతో తిరుగు

రాట్నమునకు ముందు
గుజ్జులు పర్తి ఎదురుంచి
ఊచ కదురుకు చెక్కి
పురికదల చే తిప్పించి
కుదురుగా దారాన్ని చుట్టా
దారపు కండెలుగ మారును

పొట్టెనంత చుట్టి
అచ్చుకు దారాలతుకు
పై ఆచ్చు కిందచ్చు
వేరువేరుగ అతుకు
బయట పడుగుజాపి
పంటి చుట్టుదురు

వనెను పొతముజేసి
వస్త్రకొలతలను పెట్టు
చీరల వనేకైతేను
అంబలితో సరిపెట్టు
కొలత కొలతకు లెక్క
కొలిచి చూసుకొను పక్కా

వనెను మగ్గ మెక్కించి
మగ్గాన్ని సరిచూసు
వాటమెయ్యడానికి
వాకంగా చూసు
వారెవ్వా!మగ్గ మెక్కితే
నేతన్న తనని తాను మరుచు

అచ్చు,పాకచెక్కలు
కట్టెలు, వాడుగోలా
పనె,దోనుగ,పల్లికట్టె
దండెదురు,పెడగోలా
మగ్గం అమరికలందు
పలు భాగాలు వేరుండు

ముట్టి కుడిచేత వూప
పలక ఎడమచేబట్టి
పాకచెక్కలు తొక్కుతూ
కండె నాడెలో పెట్టి
వాటమేయ అడ్డుదారంతోటి
వస్త్రముగ మారును

వస్త్రం దోనుగకుచుట్ట
పల్లికట్టె తోడ్పడును
దండెదురు పోగురానికి
వనెను తానేసుకొను
పెడగోల తాడును
గుంజి గుంజకు చుట్టు

సుట్టుకట్టుకుంటూ
మగ్గం తొక్కుతుంటే
దారం చెరిగిందంటే
కంకెపుల్ల తీస్తుంటే
మళ్ళీ ముడులువేసి
పనిలో తాను మునుగు

మగ్గం చప్పుడు వింటే
దరువేసినట్లుండును
వాడంతా పండుగలా
వరుసలు బాగుండును
ఎన్ని పనులు చేసిన
కులవృత్తికి సాటిరావు

బట్ట సాగుతూ ఉంటే
బతుకు ఆశలు కలుగు
పోగు పోగూ నందు
ఆనందమే కలుగు
నేతన్న ఆశలు
నిత్యం చందమామలు

అమ్మ లక్ష్మీమిదేవి
మా ఇంటి ఆడపడుచు
శ్రీమన్ నారాయణుడు
మా ఇంటి అల్లుడనుచు
భృగు మహర్షి చెప్పెను
భూమండలమంతటికి

మేము మార్కాండేయ
గోత్రము వారిగా
శివుని వరములు పొందిన
ఘణత మాకుండగా
మార్కాండేయున్ని
మదినిండ కొలుతుము

అగ్గిపెట్టల చీర
అమరించేలా నేసి
నేత నైపుణ్యాన్ని
జగమెల్ల చాటేసి
ఘణత కెక్కిందు నేతన్న
గగనమంతా

మానవ నాగరికతకు
వస్త్రమే తొలిమెట్టు
వస్త్రము అందం పెంచు
వస్త్రాన్ని విలువబెట్టు
వస్త్రం గౌరవము పెంచు
వస్త్రం ఆకర్షణ పెంచు

సహాయ నిరాకరణలో
గాంధీజీ అస్త్రమై
ఖాదీ వస్త్రముతో
ఊపిరి ఆయుధమై
ఉద్యమించింది చూడు
నా చేనేత వస్త్రము

పోచంపల్లి ,ఉప్పాడ
ధర్మవరం సిద్దిపేట
వెంకటగిరి,మంగరగిరి
చేనేత వస్త్రమిచట
ఉత్పత్తి కేంద్రాలుగా
భాసిల్లుతున్న విచట

చేనేత వస్త్రము
ధరించండి అందరు
నేతన్నకు చేయూత
ఇవ్వాలి మనందరు
నేత వస్త్రము ఎంతో మన్నిక
అది ఇచ్చు మనకు ఎంతోహాయి

ప్యాషన్ వస్త్రముల
మోజు పెరిగిపోయే
చేనేత వస్త్రములు
వెనుకబడిపోయే
మరో గాంధీజీ రావాలి
చేనేతకు ప్రాణము పోయాలి

రెక్కలు ముక్కలుచేసి
పొద్దంతా కష్టపడును
అందమైన వస్త్రముగని
ఆనందంతో మురుసును
కళానైపుణ్యము మెండున్న
నిరుపేద మా నేతన్న

అతివల అందాలు పెంచు
చీరలు మనకందించే
పురుషుల హుందా పెంచు
పంచెలు మనకందించే
అద్భుత చేనేతను అందరు
ఆశీర్వదించి తరించాలి

తామర తుడులతో
దారాలు తీస్తివి
దేవతలకే నీవు
వస్త్రాలు నేస్తివి
దేవతలను మెప్పించిన నేతన్న
దివ్యకీర్తి పొందినాడన్న

బ్రహ్మవంశమున పుట్టి
యజ్ఞోపవితం ధరించి
బ్రహ్మనత్వము చెంది
ధన్యుడవై నీవు నిలిచి
పద్మశాలి ఘణత
విశ్వామంత చాటావు

పద్మశాలి అంటేను
ప్రతిభ గల కులమురా
ఆవిష్కరణలకు
అత్యుత్తములురా
బిరుదు పొందినవారు
మన పద్మశాలివారు

కూదు,గుడ్డ,గూదు
మూడింటిలో నీవు
గుడ్డకే ప్రతినిదివై
నిలిచావు నీవు
వారెవ్వా నేతన్న
మూలము నీవేనన్న

చేనేత నేర్పరి
మా తండ్రి మొండయ్య
చదువు సంధ్యలు నేర్పి
మమ్ముల పెంచెనయ్య
చేనేత నెంతగానో
దైవంగ భావించి ప్రాణంగ ప్రేమించే

ఊరు ఊరున చేనేత
మగ్గములు వెలయాలి
యువతరము నేర్చుకొని
భావితరాన చూపాలి
వారెవ్వా!మగ్గము
పద్మశాలీలకు ప్రాణము

మర్కాండయ్య జయంతి
గొప్పపండుగ దినము
రథయాత్రలో వస్త్రము
నేసి సమర్పించుదుము
పద్మశాలి వంశ వృక్షమున
అందరొక్కటయ్యెదము

రైతువలె చేనేతను
ప్రభుత్వమాదుకోవాలి
వస్త్రములన్ని కొని
ప్రదాన్యతనివ్వాలి
చేనేత కళలన్ని
పదికాలాలు నిలపాలి

సంప్రదాయ చేనేతను
నలుదిశల చాటాలి
దేశ దేశాలకు
మన వస్త్రము పంపాలి
ఎగుమతులను పెంచాలి
రాబడులను పొందాలి

దేశ ఆర్థిక స్థితి
చేనేతతో పెరగాలి
వస్త్రము గొప్పతనం
వెయ్యింతలు పెంచాలి
మానవాలి రక్షణకు
నిత్యం తోడ్పడాలి

ఖాది వస్త్రము జెండై
గగనాన ఎగురుతుంటే
దేశాభిమానంతో
నేతన్న పొంగుతుంటే
ఇదే గొప్ప గౌరవము
చేద్దాము అందరము వందనం









# మెరుపులు

పద్యాన్ని పదునైన
ఆయుధంగా వాడాడు
తెలంగాణ విమోచన
తన ధ్యేయమన్నాడు !

జైలు గోడలపై
బొగ్గుతో రాశాడు
నిజాం అకృత్యాలపై
కలం ఎత్తాడు !

పీడిత ప్రజల
పక్షం వహించాడు
తెలంగాణ జనుల
గుండెల్లో నిలిచాడు !

తెలంగాణ ఉద్యమానికి
ఊపిరి దాశరథి
ఎనలేని సాహసానికి
అతను మహారథి !

తెలంగాణ కోటి
రత్నాల వీణన్నాడు
కలమెత్తడంలో మేటి
అని నిరూపించాడు

సీస పద్యాలనే
ఆయుధముగా ఎక్కుపెట్టాడు
బీదల పక్షమునే
ఎల్లప్పుడు వహించాడు

ఉద్యమము కోసము
జైలుకెళ్లాడు
ప్రజల కోసము
పాటుపడ్డాడు

తన భావాలను
కావ్యముగా మలిచాడు
అగ్నిధార గాను
మనకందించాడు

నిజాంపాలన అంతము
కావాలన్నాడు
అందుకోసము నిరంతరము
పోరాటం చేసాడు

ఉవ్వెత్తున ఎగిసిపడే
తరంగమతడు
కణకణ లాడే
నిప్పు రవ్వయతడు

జాతి కొరకు
జన్మించాడు
ప్రజల కొరకు
పాటుబడ్డాడు

నియంత పాలన
తగదన్నాడు
అణిచివేసే పాలన
మనకొద్దన్నాడు

అగ్గిని కురిపించే
నిప్పుకణికలతని కవితలు
ఉపన్యాసాలను ఆదరించే
లక్షల మంది శ్రోతలు

పోరాటం నుంచి
కళ పుదుతుందన్నాడు
ఉద్యమం నుంచి
తెలంగాణ వస్తుందన్నాడు

ఆశా వాదికి
నిరాశ తగదన్నాడు
తెలుగు సాహిత్యానికి
ఎనలేని సేవ చేశాడు

ప్రపంచ శాంతి
గమ్యమన్నాడు
తెలంగాణప్రజల కాంతి
కిరణమై నిలిచాడు

గొప్ప ఉపన్యాసకుడుగా
పేరుపొందాడు
మదమతిప్పని ధీశాలిగా
చరిత్రలో నిలిచాడు

సామాన్య ప్రజలకు
ఉత్తేజం కలిగించాడు
నిజాం రాజులకు
గుబులు పుట్టించాడు

తెలంగాణప్రజల శక్తేమిటో
తెలియచెప్పాడు
ఆత్మవిశ్వాసం ఏమిటో
చూపించాడు

సినారెతో కలిసి
నయన యుగళమయ్యాడు
సాహిత్యములో కలిసి
పయనించాడు

తెలంగాణకు జరుగుతున్న
అన్యాయాలపై పోరాడాడు
వంచకుల పాలవుతున్న
రాష్ట్రముకొరకు పోరాడాడు

దాశరథి లేఖిని
జ్వాలాముఖి
నిప్పును కురిపించిన
చంద్రముఖి

రుద్రవీణ కావ్యాన్ని
తెలంగాణకు అంకితమిచ్చాడు
తన విజ్ఞానాన్ని
ప్రజలకు పంచాడు

మాతృ భూమి
పరాయణుడు
తెలంగాణ పుడమి
కన్న ముద్దుబిడ్డడు

అవినీతి పాలనను
ఎదిరించాడు
నిజాము అకృత్యాలను
ప్రశ్నించాడు

జైలు గోడలపై
సీసపద్యాన్ని రాశాడు
మాతృ భూమిపై
ప్రేమను చాటాడు

పీడించబడుతున్న ప్రజలకు
బాసటగా నిలిచాడు
నిజాం అణిచివేతలకు
తెలంగాణ తలొగ్గదన్నాడు

తన వాగ్ధాటితో
ప్రజలను మేలుకొల్పాడు
తన కవిత్వంతో
ఆవేశాన్ని కలిగించాడు

అభ్యుదయ కవితాచక్రవర్తిగా
నిలిచాడు
ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా
సేవలందించాడు

ఉత్తమ అనువాదకుడిగా
గాలిబ్గీతాలు అందించాడు
శాంతి విప్లవవాదిగా
పేరుగాంచాడు

అభ్యుదయ దృక్పథము
ఆలోచనగా కలవాడు
రైతుదే తెలంగాణము
అని నినదించాడు

తిమిరంతో సమరము
రచన చేశాడు
పద్యమున అమృతాభిషేకము
కావ్యాన్ని రాశాడు

ఉర్దూ పారశీక కవిత్వపు
సొంపులు వ్రాసాడు
కవితా పుష్పకపు
గీతాలుగా అందించాడు

నిజాం రాజు
దాష్టీకాలను ఎదిరించాడు
జన్మజన్మల బూజు
అని అన్నాడు

ప్రజాపక్షం వహించిన
కవీశ్వరుడు
ప్రజలను మేల్కొల్పిన
నిజమైన నాయకుడు

పీడిత ప్రజలకు
యండై నిలిచినాడు
తెలంగాణ అస్తిత్వంకొరకు
పోరాడాడు

ప్రజల పక్షమును
ప్రజలగొంతుకగ మారాడు
తెలంగాణకు జీవితమును
ధార పోసాడు

ఎన్నో కావ్యములను
లిఖించాడు
ప్రజలలోన ఆవేశమును
కలిగించినాడు

పాండిత్యము కలబోసిన
ఆధ్యాత్మిక జ్ఞానము .
పద్య మై దద్దరిల్లిన
గానమతని సొంతము

భూస్వాములకు ఎదిరించిన
ధీశాలి దాశరథి
స్వాతంత్ర ఉద్యమంలోన
పోరాడిన మహారథి

అత్యున్నత ప్రతిభను
కనబరిచాడు
ప్రజల మాటను
నిజాంకు వినిపించాడు

ఏడవ తరగతి లోన
ఇరవైఐదు పద్యాలువ్రాశాడు
చదివి సుబేదారుతోన
బహుమతిని అందుకున్నాడు.

సాంఘికంగా బానిసలైన
వాళ్ళకొరకు పోరాడాడు
ప్రజలందరి తరుపున
నిజాముప్రభుత్వానికి చాటాడు

కవితా మాలలు
దండగా అందించాడు
తెలంగాణ రచయితల
సంఘ అధ్యక్షుడయ్యాడు

వాగ్దానం సినిమాలో
చిత్రసీమలో అడిగిడాడు
పలు ప్రక్రియలో
రచనలు చేశాడు

నన్నుగని పెంచిన
తెలంగాణ కరుణామయన్నాడు
మాతృభూమిలోన
చిరస్థాయిగా నిలిచాడు

చిరు వయసులో
మేటిగా నిలిచాడు
స్వాతంత్రంకొరకు జైలులో
గడిపాడు

అభ్యుదయ దృక్పథం
ఉన్న కవిత్వము
సర్వమానవ సౌభ్రాతృత్వం
ఆకాంక్షించిన కవిత్వము

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో
కళాప్రపూర్ణగా గౌరవించబడ్డాడు
మహాకవిగా ఖమ్మంలో
కీర్తించబడినాడు

అక్షరమును ఉన్నతముగా
నిలబెట్టాడు
నిజాముకు వ్యతిరేకముగా
నినదించాడు

చైతన్య స్రవంతి
దాశరథి కవిత్వము
విజ్ఞానపు కాంతి
కిరణము

తిమిరంతో సమరంతో
కేంద్రపురస్కారం అందుకున్నారు
తన రచనలతో
తెలంగాణను మెల్కొల్పాడు

ఉవ్వెత్తున ఎగిసిపడే
తరంగమతడు
నిజాంపై కణకణలాడే
నిప్పు రవ్వయతడు

మహా కవిగాను
ఘనత కెక్కాడు
సాహిత్య బిరుదులను
సొంతం చేసుకున్నాడు

ఆంధ్ర కవితా సారథిగా
నిలిచాడు
ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా
సేవలందించాడు

కవితా సొంపులను
కవితాపుష్పకంగా అందించాడు
సర్వమానవ సౌభ్రాతృత్వమును
ఆకాంక్షించాడు

శాంతి విప్లవ చైతన్యధారగా
కొనియాడ్డాడు
అభ్యుదయదృక్పథం వైపుగా
పయనించాడు

పరిమళం గుబాళించే
కవిత్వపు రసగుళికలు
సూటిగా ప్రశ్నించే
చైతన్యపు హోరాలు.








-బండారు సునీత
9440671530

భారత స్వాతంత్ర సమర యోధుడు, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీమంత్రి , రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ గౌరవ పురస్కారాలు పొందిన మహానేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ. పోరాటం, సాహసం, ధైర్యం, పట్టుదల, త్యాగం, అంకితభావం, ఉద్యమ స్ఫూర్తి, పాలనాదక్షత, ప్రజాహిత సేవ, విలక్షణమైన నాయకత్వ

# సామాజిక న్యాయ సాధనే "బాపూజీ" లక్ష్యం...

లక్షణాలు గల సమ్మేళనమే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ...

స్వాతంత్ర సమర స్పూర్తి గల ఆయన పెత్తందారి, దోపిడి సామాజిక వ్యవస్థ పై తిరుగుబాటు చేశాడు. దోపిడీకి గురవుతున్న ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసిన నాయకుడు. క్విట్ ఇండియా ఉద్యమంకు అనుగుణంగా హైదరాబాదులో సత్యాగ్రహ కార్యక్రమాలు నిర్వహిస్తూ, హైదరాబాద్ రాష్ట్రం భారత దేశంలో విలీనం కావాలని ఉద్యమానికి నాయకత్వం వహించిన గొప్ప ధైర్యశాలి. ఆ ప్రజా ఉద్యమంలో పాల్గొన్నందుకుకు 13 సార్లు అరెస్ట్ వారెంట్లు నాటి ప్రభుత్వం జారీ చేసినా భయపడలేదు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 1915 సెప్టెంబర్ 27న కనీస సౌకర్యాలు లేని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని, (ప్రస్తుతం తెలంగాణ) గిరిజన ప్రాంతమైన పూర్వ ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుతం కొమురం భీం ఆసిఫాబాద్) లోని వాంకిడి గ్రామం లో పద్మశాలి సామాజిక వర్గంలో జన్మించాడు. తన మూడు సంవత్సరాల వయసులో తల్లి మరణించింది. రాజు రామ ఘర్ లో బాల్యము గడిపిన ఆయన ప్రాథమిక విద్యను ఆసిఫాబాద్ లో, తన 20వ ఏట మిడిల్ స్కూల్ పాసై, 23 వ సంవత్సరం మెట్రిక్యులేషన్ పాస్ అయ్యాడు. 25వ ఏట హైదరాబాదులో న్యాయ వాద కోర్సు పాసైన అనంతరం 1945 లో న్యాయవాద వృత్తిని చేపట్టాడు. తన జీవిత భాగస్వామి డాక్టర్ కొండ శకుంతలాదేవి. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తన కుమారుడు ఒకరు భారత వైమానిక దళం లో ఉంటూ దేశ సేవలో వీర మరణం పొందాడు.

హైదరాబాదులోని సచివాలయానికి సమీపంలో హుస్సేన్ సాగర్ తీరాన (ప్రస్తుతం నెక్లెస్ రోడ్) భూమి కొని జలదృశ్యం అనే పేరుతో గృహం నిర్మించుకొని అందులో నివసించే వాడు. కానీ 2002లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయగా, కోర్టుకు వెళ్లిన ఆయనకు కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చింది. అతని అంత్యక్రియలు సైతం సెప్టెంబర్ 21, 2012లో జలదృశ్యం లోనే జరిగాయి.

స్వాతంత్రోద్యమ కాలంలో 1941 లో మహాత్మా గాంధీతో కలిసి, ఆయన అడుగు జాడల్లో 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. అలాగే దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత హైదరాబాద్ సంస్థానం నిజాం ప్రభువు ఆధీనంలో ఉన్న క్రమంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 1947 -48 మధ్యకాలంలో ఉద్యమానికి నాయకత్వం వహించాడు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరుగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని 1947 డిసెంబర్ 4న నిజాం నవాబు మీద బాంబు విసిరిన నారాయణ రావు పవార్ బృందంలో లక్ష్మణ్ బాపూజీ కూడా నిందితుడు. అజ్ఞాతంలో ఉండి తన ప్రాణాలు కాపాడుకున్నాడు.

1952–69 మధ్య కాలంలో జరిగిన నాన్ ముల్కీ ఆందోళనలో పాల్గొన్నారు.

## రాజకీయ జీవితం–కీలకపాత్ర

ఆనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పై ప్రభుత్వం విధించిన నిర్బంధం తొలగించిన తర్వాత 1945 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత 1952 వ సంవత్సరం లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో అదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైనాడు. 1957 లో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎస్టీ రిజర్వుడు కావడం వల్ల, పద్మశాలి సామాజిక వర్గం అధికంగా ఉన్న నల్గొండ జిల్లా కు, మారి 1957లో చిన్న కొందూరు, (ప్రస్తుతం భువనగిరి) నియోజకవర్గం నుండి గెలిచి 1957–60 మధ్యకాలంలో నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా , ఆ తర్వాత 1960–62 మధ్యకాలంలో దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో ఎక్సైజ్, లఘు పరిశ్రమలు, చేనేత , టెక్స్టైల్ శాఖ మంత్రిగా, పదవులు నిర్వహించి ఆ శాఖ లకు వన్నె తెచ్చాడు.

1967–69 కాలంలో కాసు. బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిత్వం లో కార్మిక మరియు సమాచార శాఖ మంత్రిగా రెండు పర్యాయములు కేబినెట్ మంత్రిగా ప్రశంసనీయమైన పదవులు నిర్వహించి అందరి మన్ననలు పొందిన ప్రజా నాయకుడు కొండా లక్ష్మణ్.

1962లో మునుగోడు నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా విఫలమయ్యాడు. కానీ 1967–72మరియు 1972–78 వరకు రెండుసార్లు భువనగిరి అసెంబ్లీ కి ఎన్నికయ్యాడు. నాడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎంపిక సమస్య వచ్చినప్పుడు కూడా దామోదరం సంజీవయ్య గారిని అభ్యర్థిగా నియమించడంలో తన స్వగృహమైన జలదృశ్యంలో సమావేశమైనప్పుడు సంజీవయ్యను ముఖ్యమంత్రిగా ప్రకటించడంలో తన పాత్ర ముఖ్యమైనది. నిమ్న వర్గాలకు ,అన్యాయాలను, వ్యతిరేకతను ఎదుర్కొని ఒక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినీ , ముఖ్యమంత్రిగా చేయడం అనేది దేశం లో నే చారిత్రక సంఘటనగా చెప్పవచ్చును. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కాలంలో ప్రత్యేక తెలంగాణ సాధనే ధ్యేయంగా ,1969 మార్చి 27న తన మంత్రి పదవికి సైతం రాజీనామా చేసి సంచలనం సృష్టించాడు. ఉప ముఖ్యమంత్రి పదవి అవకాశాన్ని దిక్కరించి తెలంగాణ



ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించిన గొప్ప తెలంగాణ వాదిగా చెప్పవచ్చును.

ఆ తర్వాత జరిగిన పరిణామాల క్రమంలో తెలంగాణ సాధన సమితి లో క్రియాశీలక సభ్యుడిగా ఉంటూ, నవంబర్ 2, 2008 న తెలంగాణ రాష్ట్ర హోదా కావాలని గట్టిగా డిమాండ్ చేశారు. తెలంగాణలో ధైర్యము, పట్టు వదలకుండా నాలుగు దశాబ్దాల పాటు అధికారానికి దూరంగా ఉంటూ తెలంగాణ రాష్ట్ర సాధన కే నిత్యం శ్రమించిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ.

## వెనుకబడిన వర్గాల అభివృద్ధి కై -ఉద్యమం

హైదరాబాద్ రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు సంఘాన్ని స్థాపించాడు. బొజ్జం నరసింహులు సహకారంతో 1950 సంవత్సరంలో స్థాపించి బలహీన వర్గాల ఉద్యమానికి నాయకుడిగా గణనీయమైన కృషి చేశారు. వెనుకబడినవర్గాల స్థితిగతులను మెరుగు పరచుటకు నియమించిన "కాక -కాలేల్కర్ "కమిషన్ రాష్ట్ర పర్యటన సందర్భంలో ముఖ్య పాత్ర పోషించాడు. బీసీల తో పాటు ఎస్సీ, ఎస్ టి, మైనారిటీ హక్కుల పరిరక్షణ కు , సామాజిక వివక్షతకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటం చేశాడు. అనంతరాము కమిషన్, మురళీధర్ కమిషన్ లు బీసీల కొరకు చేసిన సిఫార్సుల అమలుకు , సర్దార్ గౌతు లచ్చన్న తో పాటు అనేకమందిని ఐక్యపరచి 1986 లో బి సి ల సభ తిరుపతి లో ఏర్పాటు చేసి ,విజయవంతం చేయడం లో ఎన లేని కృషిచేసిన బాపూజీకి గుర్తుగా ఆ సభా వేదిక కొండా లక్ష్మణ్ బాపూజీ కి "ఆచార్య"అనే

> "స్వాతంత్ర సమర స్పూర్తి గల ఆయన పెత్తందారి, దోపిడి సామాజిక వ్యవస్థ పై తిరుగుబాటు చేశారు. దోపిడీకి గురవుతున్న ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసిన నాయకుడు"

బిరుదును ప్రధానం చేసింది.

## వృత్తిదారుల కోసం- సహకార ఉద్యమం

ఒకవైపు దేశ స్వాతంత్ర్యానికి పోరాటం చేస్తూనే, మరోపక్క వృత్తిదారుల దయనీయ స్థితిగతులను, మెరుగు పరచుటకు, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు సహకార ఉద్యమాన్ని చేపట్టి, గ్రామ, గ్రామాన సహకార సంఘాలను నెలకొల్పాడు. అంతటితో తృప్తి చెందక, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో సహకార ఉద్యమాన్ని బలోపేతం చేసాడు. బాపూజీ యుక్త వయసులో ఉన్న కాలం నుండి సామాజిక, సాంఘిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే, తన సామాజిక వర్గమైన చేనేత కార్మికుల సంక్షేమానికి గ్రామీణ కుటీర పరిశ్రమల స్థాపనకు విశేషమైన కృషి చేశాడు. గీత, మత్స్య, కుమ్మరి, వడ్రంగి, కంచరి, చర్మకారులు, మేదరి, ఉప్పర, ఇతర వృత్తుల వారికి సహకార సంఘాలను నెలకొల్పి వృత్తిదారుల ఆర్థిక పురోభివృద్ధికి నిర్మాణాత్మకమైన కృషి చేశాడు.

మహాత్మ పూలే, అంబేద్కర్ అందించిన ఆలోచన బడుగు బలహీన వర్గాలను ఏకం చేసే సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న నాయకుడు. తన జీవితం బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితమని చెప్పవచ్చును.

ముక్కుసూటి స్వభావం, నాయకత్వ పటిమ, సమర్థతను బట్టి రెండు సందర్భాల్లో ముఖ్యమంత్రి పీఠానికి ముందున్నా కూ డా కాంగ్రెస్ లోని అంతర్గత రాజకీయాల కారణంగా ముఖ్యమంత్రి కాలేకపోయాడు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మండల్ కమిషన్ సిఫార్సులను వ్యతిరేకించిన సందర్భంలో అసంతృప్తిగా ఉన్న ఆయన 1987లో కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాడు.

హైదరాబాదులో అఖిలభారత పద్మశాలి సంఘం ఏర్పాటులో ముఖ్య పాత్ర వహిస్తూ, తెలంగాణలో చేనేత సహకార సంఘాల స్థాపనకు, పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేశాడు.

ఆయనకు గుర్తుగా తెలంగాణ ప్రభుత్వం 2014 లో హైదరాబాదులో ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్, విశ్వవిద్యాలయంగా ప్రకటించింది. ఆయన పుట్టిన రోజు , సెప్టెంబర్ 27 న ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో 2009–12 మధ్య తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ, చలిని సైతం లెక్కచేయకుండా ఆయన 97 సంవత్సరాల వయస్సులో కూడా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేసిన నిఖార్సైన గొప్ప తెలంగాణవాది బాపూజీ ..

## అవార్డులు:

–1963 హైదరాబాద్ సెంట్రల్ కోఆపరే టివ్ యూనియన్ వజ్రోత్సవాల సందర్భంగా సహకార రత్న గోల్డ్ మెడల్

–అమెరికా బయోగ్రాఫికల్ ఇనిస్టిట్యూట్ వారి డిస్టింగ్విస్ట్ లీడర్ షిప్ గోల్డ్ మెడల్.

–2002 సంవత్సరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవార్డ్ ఫర్ ఎక్స్ లెన్స్ ఇన్ ది ఫీల్డ్ ఆఫ్ ఫిలాన్ త్రఫి అవార్డు.

–స్పెయిన్ దేశానికి చెందిన ఆల్బర్ట్ స్విట్జర్ అంతర్జాతీయ ఫౌండేషన్ వారి బంగారు పతకం.

–ఆస్ట్రేలియా అండ్ ఏసియా సివిల్ లీడర్షిప్ ఇన్స్టిట్యూట్ సిడ్నీ వారి డిస్టింగ్విస్ట్ ఫెలోషిప్ 2010 అవార్డ్ ను అందుకున్నాడు.

శ్రీ బాపూజీ లాంటి సామాజిక ఉద్యమ నాయకులు అరుదుగా కనిపిస్తారని, చెప్పవచ్చును వారి ఆశయసాధనకు భావ చైతన్యం, సామాజిక ఉద్యమకారులు వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతి జిల్లా కేంద్రంలో బాపూజీ విగ్రహాలను నెలకొల్పు టకు కృషి చేయాలి. తను నివానస్థలమైన జల దృశ్యాన్ని మ్యూజియంగా మార్చాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు...

*(సెప్టెంబర్ 27 ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా)...*



**-సామంతుల సదానందం**
98661 36491.

నాటి భూస్వాముల అరాచకత్వం నైజాము రాజు నిరంకుశత్వంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటం.

భూమికోసం ,భుక్తి కోసం సాగించిన పోరాటం నాటి హైదరాబాద్ సంస్థానంకు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ చేస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చేసిన ప్రజాపోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా మరియు శ్రమ దోపిడీకి నిరసనగా చేసిన ఉద్యమం తెలంగాణ విమోచనోద్యమం.

భారతదేశం అంతటా సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యపు పాల నుండి 1947 ఆగస్టు 15న భారతదేశం అంతటా స్వాతంత్ర్యం పొందినది. స్వేచ్ఛా గాలులు పిలుస్తున్న సందర్భంలో ఒక్క హైదరాబాద్ సంస్థానం నవాబుగా ఉన్న ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ మాత్రం స్వాతంత్రాన్ని ప్రకటించలేదు దానికి వ్యతిరేకంగా ప్రజలలో ఒక భయాందోళన మొదలైంది దానిలో భాగంగానే తెలంగాణ స్వాతంత్రంకై నిజాం నవాబును వ్యతిరేకించుటకై చేసిన పోరాటమే తెలంగాణ విమోచనోద్యమం.

తెలంగాణ విమోచనోద్యమానికై నిజాం మెడలు వంచి తెలంగాణ స్వాతంత్రానికై 1946 నుండి 1948 వరకు సాగిన ప్రజా ఉద్యమమే ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం క్రూరత్వం కలిగిన నిజాం రాజును ఓడించుటకు తన నుండి రాజ్యాన్ని మన స్వాధీనం చేసుకొనుట జరిగినటువంటి ప్రజా ఉద్యమం ఈ పోరాటం.

దోపిడీ పీడన బానిస బ్రతుకుల విముక్తికై మరియు తెలంగాణ ప్రజల స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాటం చేశారు. ఈ పోరాటంలో మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ యొక్క క్రూరమైన సైన్యం రజాకార్లు.వీరికి సైన్యాధిపతిగా ఖాసీం రజ్వీ.వీరి యొక్క ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలోని ప్రజలపై క్రూరత్వం చూపడం జరిగింది.

అలాంటి క్రూరమైన రజాకార్లను మరియు నిజాం కింద ఉన్న జాగీర్దార్ , దేశ్ ముఖ్, పటేల్ పట్వారీ వారు చేస్తున్న దౌర్జన్యాలను అక్రమాలను వ్యతిరేకించటకు సాగిన నిరంతర పోరాటం ఈ సాయుధ పోరాటం. బ్రిటిష్ వారికి సామంతులుగా ఉన్న నవాబు రజాకార్లను ఆసరాగా చేసుకుని తెలంగాణ ప్రాంతంలోని మహిళలపై పసిపిల్లలపై యువకులపై చేస్తున్న అకృత్యాలను చూసి మరియు భూస్వాములు చేస్తున్న దోపిడిని సహించలేక తెలంగాణ ప్రాంతంలోని ప్రజలు అందరూ ఏకమై పిడికిలి బిగించిన ప్రపంచ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిన ప్రజా ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటం.

ఈ పోరాటంలో దాదాపుగ నాలుగున్నర వేల ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు.

నిజాం రాజు సంరక్షకులుగా ఉన్న రజాకార్లు మహిళలపై చేస్తున్న అకృత్యాలు మరియు దోపిడీ మరియు ధన మాన ప్రాణాలను రాక్షస రజాకార్లకు వ్యతిరేకంగా చేసిన ప్రజా పోరాటం అలాగే మహిళలను నగ్నంగా చేసి బతుకమ్మను ఆడించిన నీచ రజాకార్లను ఎదిరించి అందరూ ఐక్యమైన సందర్భం తెలంగాణ సాయుధ పోరాటం.

ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేదా తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల ఉద్యమం కీలకమైన పాత్ర వహించి అనేక అవమానాలను అన్యాయాలను అక్రమాలను భరించి పోరాటం చేసిన గొప్ప శక్తివంతులు ఈ ఉద్యమంలో మహిళలు.

భారతదేశం అంతటా స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ మరి తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశత్వం వల్ల స్వాతంత్రం ఇవ్వకపోవడం వల్ల ప్రజలు ఆక్రోశం ఆవేదన ఆందోళన చెందిన సందర్భంలో ఈ ఉద్యమానికి వి వి ద . సంఘాలు,పార్టీలు,ప్రజాస్వామికవాదులు,రచయితలు ,కవులు,కళాకారులు ప్రజలందరూ సంఘటితమై పోరాడిన పోరాటం ఇది.

ఈ ప్రాంతం దాదాపుగా 200 సంవత్సరాల దోపిడి అణిచివేతకు గురైనప్పటికీ ఇక్కడ చేసిన 47 సంవత్సరాల తిరుగుబాటు అందులో సాయుధపోరాటం ఒక దశ మాత్రమే అని మనం గుర్తించాలి. దాదాపుగా 1724 నుండి 1948 వరకు అసఫ్ జాహి వంశస్థులు దాదాపుగా రెండు వందల ఇరవై నాలుగు సంవత్సరాలు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు.

హైదరాబాద్ సంస్థాన స్వాతంత్రానికై ఎందరో వీరులు ప్రాణత్యాగం చేశారు పెట్టుబడిదారీ వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థ కలిగిన ఈ ప్రాంతంలో నిజాం రాజు చేస్తున్న నీచ కృత్యాలను ఎదిరించుటకు అప్పట్లో హైదరాబాద్ సంస్థానంలో ఉన్న 16 జిల్లాలు అందులో మన తెలంగాణ ప్రాంతం నుండి 8 జిల్లాలో కన్నడ మహారాష్ట్ర నుండి 8 జిల్లాలు మొత్తం 16 జిల్లాలు హైదరాబాద్ సంస్థానంలో ఉండేవి.ఇక్కడ బహుభాషా ప్రాంతం అయినప్పటికీ నిజాం రాజుకు భాషపై ఉన్న మక్కువతో ఉర్దూ భాషకు ప్రాముఖ్యత ఇవ్వడం వెనకాల నష్టాన్ని ప్రజలు గుర్తించి ఆక్రోశం చెందారు.కులం, ప్రాంతం,భాష మరియు ఆర్థికంగా ప్రజలకు ఇబ్బందులు పెడుతూ రజాకార్లు చేస్తున్నా దోపిడీకి ప్రజలు తిరగబడ్డారు. అప్పట్లో తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఎనిమిది జిల్లాల నుండి ప్రజలందరూ వీర తెలంగాణ సాయుధ పోరాటంగా మార్చి పిడికిలి బిగించి నిజాం రాజు పీడను వదిలించుటకు ప్రజలందరూ ఏకమయ్యారు ఉద్యమాలు సాగించారు.

రజాకార్లకు సైన్యాధిపతిగా ఉన్న ఖాసీం రజ్వీ నీచ బుద్ధులకు ఈ ప్రాంత ప్రజలు స్వస్తి పలికారు.రజాకార్లు అప్పట్లో తెలంగాణ ప్రజల ఆస్తులు దోచుకోవడం, పంట పొలాలు తగలబెట్టడం ,లూటీలు చేయడం హత్యలు,ఆత్మహత్యలు చేయడం ఇలాంటి ఎన్నో గాయాలకు పాల్పడిన అటువంటి రాక్షస దళం రజాకార్లను ఎదిరించుటకు నాడు మొదటిసారిగా బీజం వేసిన ప్రాంతం నల్లగొండ ప్రాంతం అలా మొదలైన ఈ ఉద్యమం బైరాన్ పల్లి,బీబీనగర్ జనగామ ,పరకాల వంటి ప్రాంతాల్లో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి నిజాం రాజుకు నిద్రలేకుండా చేసిన సందర్భాలు.

అణచివేత విధానాలకు నిరసనగా ఈ పోరాటం జరిగింది. హైదరాబాదు సంస్థానంలో మరాఠీ వారు మరియు తమిళ్ లు ఉండగా కేవలం ఉర్దూ భాషను మాత్రమే ప్రోత్సహించి మిగిలిన భాషలలో అణచివేసే ప్రయత్నం చేయడం వల్ల ప్రజలలో ఉద్యమం మొదలైంది.

మరోపక్క ఎక్కువ భూములు ఉన్న భూస్వాములు వారి వద్ద భూములు ఉండడం వల్ల సామాన్య రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడటం వల్ల భూమికోసం భుక్తి కోసం చేసిన సామాన్యుల తిరుగుబాటు తెలంగాణ సాయుధ పోరాటం.

నీ బాంచెన్ కాల్మొక్త దొరా అంటూ బానిసలుగా చేసుకొని పరిపాలిస్తున్న పెత్తందార్ల దోపిడి దారుల కాలం నాటిది . అలాంటి వ్యవస్థకు వ్యతిరేకంగా రాక్షస రజాకారు దళాల దురాగతాలకు స్వస్తి పలికుటకు చేసిన పోరాటం.

తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలను

# తెలంగాణ విమోచనోద్యమం

రజాకార్లు మానభంగాలకు గురిచేయడం.మరియు అనేకమందిని రజాకార్లు క్రూరంగా చంపడం వంటివి జరిగేవి. వీటన్నిటినీ పసిగట్టి తెలంగాణ సాయుధ పోరాటంలో ఒక్కొక్కరు ఒక్కొక్క ఆయుధాన్ని తీసుకొని తుపాకులను చేత బట్టి రజాకార్లను మహిళలు తరిమికొట్టారు. అలా తరిమికొట్టిన అటువంటి వాటిలో అనేక జిల్లాలోని ప్రజలు కరీంనగర్ నల్గొండ వరంగల్ మహబూబ్ నగర్ వంటి ప్రాంతాలలో ప్రజలు నిజాంకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాటం చేశారు.

> "భూమి కోసం,భుక్తి కోసం సాగించిన పోరాటం నాటి హైదరాబాద్ సంస్థానంకు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ చేస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చేసిన ప్రజాపోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం"

అలాంటి సందర్భంలోనే ప్రజలు దాడులకు ప్రతి దాడులుగా చేయడం జరిగింది. వంటింటికే పరిమితమైన మహిళలు ,గాజులు వేసుకున్న స్త్రీలను గండ్రగొడ్డలిని పట్టుకోవడం చేసింది రజాకార్ల ఆక్రోశం.అలాంటి పోరాటం తిరుగుబాటు నిజాం ప్రభుత్వ నిరంకుశతను ఎదిరించి చేసిన పోరా టంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. షోయబుల్లా ఖాన్,ముగ్దు మోహియుద్దీన్ మరియు రావినారాయణరెడ్డి ,చంద్ర రాజేశ్వరరావు మల్లు స్వరాజ్యం ,చాకలి ఐలమ్మ ,దాశరథి , కాళోజి నారాయణరావు ,సురవరం ప్రతాపరెడ్డి ,ఆరుట్ల కమలాదేవి ,మాడపాటి హనుమంతరావు వంటి ఎంతోమంది వీరుల ఉద్యమం అందరికి స్ఫూర్తిగా నిలిచింది.

నిజాం వ్యతిరేక ఉద్యమంలో కవులు రచయితలు ప్రముఖ పాత్రను పోషించి దాశరథి వంటి వారు జైలు గోడలపై బొగ్గుతో కవితలు రాశారు.మానవత్వానికి రాక్షసత్వానికి మధ్య జరిగే సంఘర్షణ నిజాం పరిపాలన ఒక కవితా వస్తువుగా మారింది దాశరథి వంటి కవులకు.నిజాం వ్యతిరేక ఉద్యమం అని చెప్పగానే ఈ కవిత్వం వెంటనే గుర్తుకు వస్తుంది.**ఈ పద్యం అగ్నిని కురిపిస్తోంది**

**ఓ నిజాము పిశాచమా కానరాడు**
**నిన్ను బోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటి రత్నాల వీణ**

అనే పద్యం ద్వారా నిజాం రాజు అకృత్యాలకు అంతం లేదు అని చాటాడు.ఆ రోజుల్లో నిజాం నవాబును పిశాచం ,ముసలి నక్క, మా నిజాము నవాబు జన్మజన్మల బూజు అని చాటాడు. ఇలా అనడానికి ఎంతో ధైర్యం ఉండాలి. మరి దానికి దాశరథికి పడినటువంటి ఇబ్బందులు ఆయనను జైలు వరించాయి.జైలు నివాసస్థలమైన ఆయనకు దీనిలో భాగంగా దాశరథి వంటి కవులులో నిరసన మరింత తీవ్రమైంది.

ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మన ప్రాంతాన్ని సొంతం చేసుకోవడానికి రజాకార్లను మనపై ఉసిగొల్పాడు. ఈ రజాకార్లు దోపిడీ చేయడం ,ఇళ్లను తగలబెట్టడం నానా అరాచకాలు సృష్టించారు.దీనితో ప్రజల ఇబ్బందిని గుర్తించి రామానందతీర్థ నేతృత్వంలో ఆర్యసమాజ్ ఉద్యమాలు,కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు ఉధృతమై నిజాం రాజు మెడలు వంచి నియంత నిజాం రాజును ఎదిరించి ఎంతోమంది వీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఉద్యమం ఉధృతం చేశారు.నిజాం పాలనపై ప్రజలు తిరగబడ్డారు. ఒక్కొక్కరు ఒక్కొక్క ఆయుధాన్ని తీసుకొని రజాకార్లను ఎదిరించారు. కర్రలు,బరిసెలు ,కారం, వడిసెలు,గోత్పులు, ముంతలు వంటి వాటిని ఆయుధాలుగా చేసుకుని తుపాకులను సంపాదించుకొని యుద్ధరంగంలోకి వెళ్లి రజాకార్లను ఎదిరించారు. ఇలాంటి సందర్భంలోనే భారత ప్రధానిగా ఉన్న నెహ్రూ గారు నిజాం నవాబుల చర్చలకు ఆహ్వానిస్తే వారు నిరాకరించడంతో నాడు హోంమంత్రిగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత ప్రభుత్వ సైనిక చర్యతో నైజాం సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్ లో విలీనం చేసింది.దీనితో నిజాం రాజు లొంగిపోయి మన తెలంగాణకు మనకు స్వాతంత్రం ఇవ్వడం జరిగింది.

దీన్ని నేడు మనము విలీనం అందామా,విమోచనం అందామా,విద్రోహదినం అందామా ఎందుకంటే స్వాతంత్రం రోజు అనగా సంబరాలు జరుపుకోవాలి. మరి అలాంటి సందర్భం లేని ఈ యొక్క రోజును మరి మనమేమందాం. భోగ విలాసం, క్రూరత్వం మతతత్వం మరియు నియంతలా వ్యవహరించిన నిజాం రాజును ఎదిరించుటకు చేసిన పోరాటంలో పార్టీలు ,సంఘాలు, ప్రజలు సంఘటితమై చేసిన పోరాటం వల్ల తెలంగాణ స్వేచ్ఛను దక్కించుకోవడంలో పడ్డ ఇబ్బందులు నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కంటే క్రూరంగా జరిగిన ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం.దీనిలో అనేక అవమానాలు ,త్యాగాలు మరి నేడు ప్రపంచ చరిత్రలోనే గొప్ప ఉద్యమం గా కీర్తి పొందిన ఈ తెలంగాణ సాయుధ పోరాటం యొక్క ప్రత్యేకతను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఈ దినోత్సవాన్ని గుర్తించుకోవడం ఎంతైనా అవసరం.

నాడు 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటికీ అప్పుడు ప్రత్యేకంగా ఈ దినోత్సవాన్ని ఎక్కడ గుర్తించలేదు దానికి కారణాలు తెలియలేదు.కావున నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఈ దినోత్సవానికి ఓ ప్రాముఖ్యతగా,చరిత్రగా గుర్తించి రైతాంగ పోరాటంను,ఈ సాయుధ పోరాటంను, తెలంగాణ స్వాతంత్రోద్యమ పోరాటంను ఒక పండుగల జరుపుకోవాలని,ఎంతో మంది తెలంగాణ వీరుల త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆశిస్తూ..



**-డా॥తెలుగు తిరుమలేష్**
9908910398

## నేటి నిజాలు




## అక్షరం

అలసిన ప్రాణులకు ఆసరానందిస్తుంది – అక్షరం
అందరితోనూ మర్యాదగానే మసలేలా నేర్పిస్తుంది – అక్షరం
అనవసరపు పన్లు చేయవద్దని చెబుతుంది – అక్షరం
అవసరమెరిగి – అండ – దండగా వుండేలా అలరించే వరం – అక్షరం.

అన్యాయపు పన్లు చేయనివ్వదు – అక్షరం
అనన్య సామాన్యుడిగా వెలుగొందేలా చేస్తుంది – అక్షరం
అతిగా వాగితే – అనర్థం తప్పదని తెలుపుతుంది – అక్షరం
అందరితోనూ – కలిసిమెలిసి మెలగటం నేర్పిస్తుంది – అక్షరం.

అతిసామాన్యుణ్ణి కూడా ఆదరించటం నేర్పిస్తుంది – అక్షరం
అభినందించే గుణాన్ని అలవరుస్తుంది – అక్షరం
అవతలివారిని అకారణంగా ఆడిపోసుకోవద్దని తెలుపుతుంది – అక్షరం
అడుగు అడుగున ప్రగతిని అందుకేనేలా చేసే పార్శ్వం – అక్షరం.

అవినీతికి అండగా నిలవనివ్వదు – అక్షరం
అనుబంధం అల్లుకునేలా నేర్పిస్తుంది – అక్షరం
అమృతంలా అలరిస్తూ – నియంతలా మారనివ్వదు – అక్షరం
అంగళ్ళరతనాలను అందించే వరం – అక్షరం



**–లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
సెల్: 94404 48650

## మూడో అడుగు

నింగికి నేలకు మధ్యన
మిథ్యల మిద్దెలు.
చీకటి వెలుగుల మధ్యన
నీడల సరిహద్దులు.
తూర్పు పడమరల మధ్యన
ఉదయాస్తమానాల పొద్దులు.
మంచి చెడుల మధ్యన
సాగేటి సంఘర్షణలు.
ధర్మం అధర్మం మధ్యన
తీరని ఆవేదనలు.
ప్రేమ పగల మధ్యన
నమ్మకాల అమ్మకాలు.
మనిషికి మనిషికి మధ్యన
అహంభావాల అడ్డు గోడలు.
జీవి జీవులకు మధ్యన
బ్రతుకు పోరాటాలు.
రెండు కన్నుల మధ్యన
కనిపించని మనో నేత్రం.
రెండు గుండెల మధ్యన
మూడు ముళ్ల ముడి.
రెండు అడుగుల మధ్యన
నా అదృష్టం,
నీ "మూడో అడుగు" వడుగా!??.



**–పి.బక్కారెడ్డి,** 9705315250.

## విటమిన్

విటమిన్లండి విటమిన్ లు
బలాన్ని పంచే విటమిన్లు !విటమిన్!
క్యారెట్, క్యాబేజీ తిన్నాగానీ
"ఏ" విటమిన్ వచ్చునండి
చేపలు,చికెన్, వెల్లుల్లి,గుడ్లు
"బి" విటమిన్ పంచుతుండు !విటమిన్!
టమాటా, నిమ్మ,ఉసిరి తింటే
"సి" విటమిన్ దండిగనుండు
సూర్యరశ్మి కొరకు ఎండన నిల్చిన
"డి" విటమిన్ ఒంటిన చేరును !విటమిన్!
బాదం పప్పు, ఆయిల్ నందు
"ఇ" విటమిన్ నిలిచి వుండును
విటమిన్లన్ని అండగా నిల్వగా
ఆరోగ్యంతో మనం అడుగులేయుదుము
!విటమిన్!



**–ఉండ్రాళ్ళ రాజేశం,**
9966946084

## కాగితాలు

గతంరద్దికాగితం
ప్రస్తుతం దినపత్రిక
భవిష్యత్తు ప్రశ్నాపత్రం.

కాలంతో నడవక
మనిషిగా మసలక
నడిచే జీవితం
టిష్యూ కాగితం.

**–రేడియమ్**
9291527757

## నాటి సభలు, సమావేశాలు...

సెప్టెంబర్ 16 నుండి సెప్టెంబర్ 23 వరకు

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 16



సెప్టెంబర్ 16, 2014న తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో "నిన్ను నువ్వు తెలుసుకో మానవ" తాత్విక గేయ శతక గ్రంథానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారికి అంకితం ఇస్తున్న రచయిత నాగబాల సురేశ్‌కుమార్. వేదికపై వై.కె.నాగేశ్వరరావు, బైస దేవదాసు, మురళీధర్‌గౌడ్, డి. ఖాళీదాస్ తదితరులు.



2014 మార్చి 12న ఒక సభలో డా॥ నాళేశ్వరం శంకరంను జ్ఞాపికతో సత్కరిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. చిత్రంలో బిక్కి కృష్ణ.

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 17



సెప్టెంబర్ 17, 2003లో రాజ్‌భవన్‌లో జరిగిన ఒక సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, బైస వీణాదాస్, స్వతంత్ర.



2005లో నేటినిజం దినపత్రిక స్వాతంత్ర దినోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభలో బైస దేవదాసు, ప్రఖ్యాత రచయిత, న్యాయమూర్తి మంగారి రాజేందర్ (జింబో)

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 18



సెప్టెంబర్ 18, 2001లో సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, 'తాకీద్' దినపత్రిక సంపాదకులు సర్దార్‌బాయ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, 'ఉషోదయం' దినపత్రిక సంపాదకులు అలీఖాన్ రషీద్



సెప్టెంబర్ 18, 2005న జరిగిన ఒక సభలో ముక్తేవి భారతి, బైస దేవదాసు, శ్రీమతి బైస వీణదాసు, డా॥ నాళేశ్వరం శంకరం, జ్వాలాముఖి.

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 19



సెప్టెంబర్ 19, 2019న అనకాపల్లిలో ఇండియన్ హైకూ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నానీల రాష్ట్రస్థాయి సదస్సులో ప్రముఖ రచయిత నలిమెల భాస్కర్‌కు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ప్రముఖ సంఘ సేవకురాలు తోట విజయలక్ష్మి. చిత్రంలో కోపూరి పుష్పాదేవి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు తదితరులు.



సెప్టెంబర్ 19, 2010న అనకాపల్లిలో ఇండియన్ హైకూ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి నానీల సదస్సులో 2008 సంవత్సరానికి నానీల అవార్డును కోపూరి పుష్పాదేవికి ప్రదానం చేస్తున్న తోట విజయలక్ష్మి, బైస దేవదాసు, డా॥రఘు, పి. లక్ష్మణరావు.

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 20



సెప్టెంబర్ 20, 2015న త్యాగరాయ గానసభలో పొద్దుటూరి మాధవిలత కవితా సంపుటి "గాయాలెన్నైనా.." ఆవిష్కరణ సభలో పోరెడ్డి రంగయ్య, రమణ వెలమకన్ని, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥నందిని సిధారెడ్డి, కవయిత్రి పొద్దుటూరి మాధవిలత, దాస్యం సేనాధిపతి, డా॥తెన్నేటి సుధాదేవి.



పొద్దుటూరి మాధవిలతను జ్ఞాపికతో సత్కరిస్తున్న బైస దేవదాసు, డా॥నందిని సిధారెడ్డి తదితరులు.

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 20



సెప్టెంబర్ 20, 2015న త్యాగరాయ గానసభలో పొద్దుటూరి మాధవిలత కవితా సంపుటి "గాయాలెన్నైనా.." ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై రమణ వెలకమన్ని, డా॥నందిని సిధారెడ్డి, దాస్యం సేనాధిపతి, మాధవీలత, తెన్నేటి సుధ.



బైస దేవదాసును సత్కరిస్తున్న డా॥నందిని సిధారెడ్డి, పొద్దుటూరి మాధవీలత, రమణ వెలకమన్ని, దాస్యం సేనాధిపతి

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 21



సెప్టెంబర్ 21, 1997న జూబ్లీ హాలులో జరిగిన సమావేశంలో హోంమంత్రి ఎ. మాధవరావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సీనియర్ జర్నలిస్టులు బైస రామదాసు, బైస దేవదాసు



సెప్టెంబర్ 21, 1998న జూబ్లీ హాలులో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి అశోక్ గజపతి రాజు, సీనియర్ జర్నలిస్టులు ఎ.బి.కె. ప్రసాద్, ఐ. వెంకటరావు, ఎం.వి.ఆర్. శాస్త్రి, బైస దేవదాసు తదితరులు

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 22



సెప్టెంబర్ 22, 2019న బ్రాహ్మణపల్లిలో "అమ్మ యాది ఫౌండేషన్" 8వ వార్షికోత్సవం సందర్భంగా నేటినిజం దినపత్రిక సంపాదకులు బైసదేవదాసుకు "అమ్మయాది జీవన సాఫల్య పురస్కారం" ప్రదానం చేస్తున్న సంస్థ అధ్యక్షులు పెండెం సత్యనారాయణ దంపతులు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుద్దాల రవితేజ, సాహిత్య



సభలో ప్రసంగిస్తున్న "అమ్మయాది జీవన సాఫల్య పురస్కార గ్రహీత"

### జ్ఞాపకాలు సెప్టెంబర్ 23 & 24



సెప్టెంబర్ 23, 2015న త్యాగరాయ గానసభలో అక్కినేని నాగేశ్వరరావు 92వ జయంతి సందర్భంగా పత్రికా రంగానికిగాను 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు "కళావశిష్ట" పురస్కారంతో సత్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి. వేదికపై బి. జయంత్, రామకృష్ణ, పి. విజయబాబు, ఆర్.శ్రీనివాసరావు, గుడిబండి వెంకటరెడ్డి,



సెప్టెంబర్ 24, 2017న తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో జరిగిన "గుఱ్ఱం జాషువ జయంతి" సభలో ప్రముఖ కవి పాడేటి జాన్సన్‌కు జాషువా పురస్కారం ప్రదానం చేస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ ఆత్మీయ లక్కరాజు నిర్మల, ఎడ్లకల్లేష్, కళా వి.యస్.జనార్థనమూర్తి, చిక్కా రామదాసు.

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123

ప్రథమ బహుమతి విజేత — శీర్షిక: **అమరవీరుడు**

పల్లవి: భూతల స్వర్గమ్ముదిగో బెదురుతుంది చూడరా
రాకాసుల చర్యలతో రావణ కాష్టమ్మురా ॥2॥.
చరణం: కర్మభూమి కాపాడగ కల్నల్ కదలెల్లెరా
ఈ దేశపు పోరుడిగా బాధ్యత గుర్తెరిగెరా
గాల్వను లోయల్లోన రగులుతుంది చూడరా
కదనానికి సైయంటూ సారథియై సాగెరా ॥భూతల॥.
చరణం:కంటిమీద కునుకు లేని కవాతులను చూడరా
చైనా బార్డరులోన చిరుతయై దూకెరా
ఎత్తైన కొండలలో విరిగిపడ్డ చరియలురా.
తుపాకుల మోతలతో తిరగబడ్డ రాతలురా ॥భూతల॥
చరణం:వీరమాత తినిపించెను దేశభక్తి ఉగ్గునురా
కట్టుకున్న భార్య పంపె కదనభూమి కడకురా
నీ కన్న పిల్లలొదిలి భరతభూమి సేవకురా
నీ రాక కొరకు వారు ఎదురు చూడవట్టెరా ॥భూతల॥
చరణం: దేశ ప్రజల కొరకు జవాన్ దేహమునర్పించెరా
మాతృభూమి రుణము దీర్చ మరణం ముద్దాడెరా
వృధా కాదు నీ మరణం పొందుము అమరత్వము
మరిచిపోము మీ త్యాగం మీరే మా దైవమూ
॥భూతల॥

-గంగాపురం శ్రీనివాస్
సిద్దిపేట

ద్వితీయ బహుమతి విజేత — శీర్షిక: **సజీవమూర్తులు**

పల్లవి: ఇల..పై సగుణ రూపాలు...
జనమానసపూ....దైవాలు..
అను నిత్యం ఒక తిరునాళ్ళూ..
అను నిత్యం ఒక తిరునాళ్ళూ.
చ॥ జనవనానికి దూరమై
అనాథ ఆదిమల పాలిట దేవతలై...
అనునిత్యం అందించే వైద్యాలు..
నేటి భారతంలోని పూలాంటి నిజాలూ..!!ఇలపై!!
చ॥ఉన్నత విద్యను అభ్యసించి
విలాస జీవితాన్ని త్యజించి
అనాగరికులకు నాగరికత నేర్పించి
విద్యా,వైద్యం అందిస్తున్న
సజీవ మూర్తులూ..!!ఇలపై!!
చ॥పశు పక్ష్యాదుల రక్షణలూ
లోక బిరాదరీ ప్రకల్పాలూ...
చేపట్టేందుకు..పెట్టిరి తమ
జీవితాల పణాలు..
అవే దైవత్వపు లక్షణాలు......!!ఇలపై!!
చ॥ హేమల్కసా ఆదిమలూ..
ఆరాధించే "ప్రకాశ్ ఆమ్టేదంపతులు"..
మానవతను పంచే పార్వతీపరమేశ్వర
రూపాలు..దివిని దిగి వచ్చిన
దేవతామూర్తులు.....!!!!ఇలపై!!



-సావిత్రి రంజోల్కర్
నవీ ముంబై.

## విత్తనాలు తయారు చేసేలా రైతులు ఎదగాలి

### ఆర్థికంగా లాభాలు గడించే పంటలు పండించాలి

### -మంత్రి హరీష్ రావు సూచన

సిద్దిపేట,సెప్టెంబర్23 (ఆర్ ఎన్ఎ): రైతులు, ప్రజా ప్రయోజనార్థం వారి ఆదాయాభివృద్ధి పెరిగేలా.. సేవ చేసినప్పుడే నిజమైన ప్రజాసేవ చేసినవారవుతారని ప్రజాప్రతినిధులకు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. రైతులు విత్తనాలు తయారు చేసేలా ఎదగాలని అన్నారు. జిల్లాలోని నంగునూరు మండలం సిద్దన్నపేటలోని శ్రేష్ట ఫంక్షన్ హాల్ లో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఇండ్లకు నష్టపరిహారం చెక్కులను అందజేశారు. అలాగే ఆత్మహత్య చేసుకున్న రైతు అంజవ్వ కుటుంబానికి రూ. 5 లక్షలు, పశువులు మృతి చెందిన ఇద్దరికి, కాల్వల భూసేకరణలో భూము లు కోల్పోయిన నిర్వాసితులకు మొత్తం 216 మందికి గాను రూ.77 లక్షల 30 వేల 432 రూపాయలు విలువ చేసే చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మిల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కర్ణాటక, ఏపీలోని చింతలపూడిలో కీరదోస సాగులో మంచి దిగుబడి సాధిస్తున్నారని తెలిపారు. రెండు నెలల వ్యవధిలో ఎకరం వంటకు 70 వేల రూపాయలు నుంచి లక్ష రూపాయలు మిగులుతున్నాయని చెప్పారు. ఆ దిశగా రైతులకు లాభం చేకూర్చే పంటల సాగుపై చైతన్యం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులకు మంత్రి సూచించారు. విత్తనాల్ని కొనుక్కు రావడమే కాదు, తయారు చేసే పని కూడా నంగునూరు మండల రైతులు చేయాలన్నారు. ఆ దిశగా రైతుల్ని ప్రోత్సహించి వారు ముందు కొచ్చేలా చైతన్యం చేయాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి చెక్కుల్ని, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వివరించారు. మండలం లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రతి గ్రామంలో రైతువేదిక, డంప్ యార్డు, వైకుంఠ ధామం నిర్మాణాలు ఈ దసరా పండుగలోపు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పెండింగ్ లో ఉండకుండా పూర్తి చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## కొత్త బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనలో పాల్గొన్న టీఆర్ఎస్

### -రైతు ప్రయోజనాల కోసం మా తపన అన్న కెకె

న్యూఢిల్లీ,సెప్టెంబర్23( ఆర్ఎన్ఎ): రైతును కాపాడడం తమ కర్తవ్యమని రాజ్యసభలో టీఆర్ఎస్ నేత కె కేశవరావు అన్నారు. కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో విపక్షాల నిరసన చేపట్టగా టిఆర్ఎస్ ఎంపిలు కూడా కలసి పాల్గొన్నారు. గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మార్చ్ నిర్వహించాయి. విపక్ష సభ్యులతో కలిసి టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు ఆందోళనలో పాల్గొన్నారు. రైతాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజ్యసభలో టీఆర్ఎస్ నేత కె కేశవరావు మాట్లాడుతూ మొదటిసారిగా ప్రతిపక్షాలు అన్ని ర్యాలీ తీసినట్లు చెప్పారు. గాంధీ స్ఫూర్తితో ర్యాలీ తీశామని, మహాత్ముడు సైతం భూమి కర్షకుడిదే అన్నాడని గుర్తు చేశారు. అలాంటి భూమిని కార్పోరేట్ సెక్టార్‌కి అప్పగించి రైతును అణగదొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతును కాపాడడం మా కర్తవ్యమని స్పష్టం చేశారు. వ్యవసాయ బిల్లును కేంద్ర ప్రభుత్వం సభలో తప్పుడు పద్ధతిలో పాస్ చేశారని ఆరోపించారు. సభ్యులను రూల్స్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారన్నారు. బిల్లును వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు జీ సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, సురేష్‌రెడ్డితో పాటు విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు పాల్గొన్నారు.

# బీజేపీ వరుస ఎన్నికల సవాళ్లు

### టీఆర్ఎస్‌ను ఢీకొంటేనే బీజేపికి ఉనికి

### కొత్త అధ్యక్షుడు బండి సంజయ్‌పై ఎన్నికల భారం

హైదరాబాద్,సెప్టెంబరు 23(ఆర్ ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్÷-తో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలని బిజెపి ఉవ్విళ్లూరుతోంది. బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ఇప్పటికే పార్టీ కార్యక్రమాలతో జోరు పెంచారు. గ్రేటర్‌లో కూడా సత్తా చాటాలని చూస్తున్నారు. ప్రజల్లో చొచ్చుకుని పోయేలా క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. ఇటీవల వివిధ కార్యక్రామ లతో బిజెపి నేతలు జోరు పెంచారు. జిల్లా స్థాయిలో కూడా కార్యక్రమాలు చేపట్టారు. విమోచన దినోత్సవం, ఎల్ఆర్ఎస్ తదితర బిల్లులపై పోరాటాలు చేస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్.. కరోనావల్ల భారీ కార్యక్రమాలు చేపట్టలేకపోయారు. ఇటీవలే దూకుడు పెంచారు. జిల్లాలను చుట్టేస్తున్నారు. తాజాగా విమోచన దినోత్సవం పేరుతో యాత్ర చేపట్టారు. సంజయ్ హిందూ వాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. బండి సంజయ్‌కు అసలు సిసలు పరీక్ష త్వరలో ఎదురు కాబోతోంది. వరుస ఎన్నికలను ఆయన ఎదుర్కోబోతు న్నారు. అవి కూడా ఒకే రకమైన ఎలక్షన్స్ కావు. ఒకటి అసెంబ్లీ మరికొన్ని ఎమ్మెల్సీ.. ఇంకొన్ని మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు. బీజేపీకి ఏ మాత్రం బలం ఉందో.. క్షేత్రస్థాయిలో ఎంతటి పట్టు ఉందో ఈ ఎన్నికలతో తేటతెల్లం కానుంది. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిర్దేశించారు. అలాగే హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచేలా తగిన వ్యూహరచనతో ముందడుగు వేస్తున్నారు. ఇకపోతే బీజేపీ ఆరుగురు అధ్యక్షులను నియమించింది. ఇంత వరకూ జిల్లాకు ఒక అధ్యక్షుడు ఉండగా ఇప్పుడు ఏకంగా ఆరుగురిని నియమించి కొత్త పంథాకు శ్రీకారం చుట్టింది. గ్రేటర్ ఎన్నికలు వస్తున్న సమయంలో బీజేపీ నలువైపులా అధ్యక్షులను నియమించి పార్టీ కార్యకలాపాలను వికేంద్రీకరించింది. హైదరాబాద్ జిల్లాను నాలుగు విభాగాలుగా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలను అర్బన్, రూరల్‌గా విడదీసి వేర్వేరుగా అధ్యక్షులను నియమించింది. మొదట బీజేపీ నగర శాఖగా ఉండేది, ఈ తరువాత గ్రేటర్‌కు విస్తరించారు, ఆ తరువాత మళ్లీ నగరానికి కుదించారు. ఇప్పుడు ఏకంగా ఆరు భాగాలుగా విభజించి కొత్త రాజకీయానికి తెరలేపింది. నగర శాఖలో ఒక అధ్యక్షుడికి నాలుగు చొప్పున అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయించారు. ఆయా ప్రాంతాలన ఒక్కో జిల్లాగా పరిగణించి అధ్యక్షులను నియమించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో కొంత భాగాన్ని మహంకాళి - సికింద్రాబాద్ జిల్లాగా నిర్ణయించారు. ఇందులో ముషీరాబాద్, సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలకు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. బర్కత్‌పురా - అంబర్‌పేట పరిధిలో అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, నాంపల్లి నియోజకవర్గాలకు కలిపి డాక్టర్ ఎన్.గౌతంరావును జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గోల్కొండ - గోషామహల్ పరిధిలో గోషామహల్, చార్మినార్, కార్వాన్ నియోజకవర్గాలకు కలిపి వి.పాండుయాదవ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. భాగ్యనగర్-మలక్‌పేట పరిధిలో మలక్‌పేట, కార్వాన్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురాలకు కలిపి సామారెడ్డి సురేందర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మేడ్చల్ అర్బన్‌కు పన్నాల హరీ?షరెడ్డిని, రంగారెడ్డి అర్బన్‌కు సామ రంగారెడ్డి లను జిల్లా అధ్యక్షులుగా నియమించారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హరీష్ రెడ్డి గతంలో టీడీపీ తరపున కేపీహెచ్‌బీ కాలనీ నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2016 గ్రేటర్ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్‌లో చేరి బాలాజీనగర్ డివిజన్ నుంచి భార్య కావ్యారెడ్డిని గెలిపించుకొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడి ఓటమిపాల య్యారు. అనంతరం బీజేపీలో చేరారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

## కుషీనగర్ విమానాశ్రయం ఓపెన్

### అంతర్జాతీయ విమాన సర్వీసులకు అంగీకారం : యోగి

న్యూఢిల్లీ,సెప్టెంబరు 23(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దీపావళి కానుక ప్రకటించారు. దీపావళి సందర్భంగా కుషీనగర్ విమానాశ్రయంలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభిస్తామని సీఎం యోగి ప్రకటించారు. యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గమైన గోరఖ్ పూర్ నగరానికి 52కిలోమీటర్ల దూరంలోని కుషీనగర్ విమానాశ్రయంలో అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రమంత్రివర్గం నిర్ణయించిందని సీఎం యోగి చెప్పారు. యూపీలో అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలతో పర్యాటక రంగానికి ఊపు లభిస్తుందని సీఎం చెప్పారు.




### ఏ మొహం పెట్టుకుని ఎన్నికలకు వెళతారు: కొండా

హైదరాబాద్,సెప్టెంబర్23 (ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ నేతలు ఏ మొహం పెట్టుకుని ఎన్నికలకు వెళ్తారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్‌లో ఇన్ని అనర్థాలు జరుగుతున్నా ప్రజలకు సమాధానం చెప్పడం లేదన్నారు. టీఆర్ఎస్ బలం డబ్బు మాత్రమేనని చెప్పారు. నాలాలలో పడి ప్రజలు చనిపోతే ఎటకారంగా మాట్లాడారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందన్నారు. హైదరాబాద్‌ను ఇస్తాంబుల్ చేస్తున్నారని చెప్పారు. నాలాలో కొట్టుకుపోయి ఇద్దరు అమాయకులు చనిపోయినా ప్రభుత్వం కళ్లు తెరవలేదన్నారు.

ఒకతను నీ దగ్గరికొచ్చి
"నువ్వు చాలా మంచోడివనగానే"
పొంగిపోకు! ఎందుకంటే...?
అది నీ గురించి కాదు.
అతడి గురించి.... !!
మరో అతను నిన్ను సమీపించి
"నువ్వు చెడ్డోడివనగానే"
కుంగిపోకు ! కారణం... ?
అది నీ గురించి కాదు.
అతడి గురించి.....!!

-మునిమడుగుల రాజారావు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com